

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

బుధవారం 14-5-2025 పేజీలు: 16

## ఉత్తరాంధ్ర
విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం




## వేపగుంట-పినగాడి వయా
# నరకం

- ఈ రోడ్డును ఎందుకు బాగు చేయరు
- వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.14 కోట్లు ఏమైనాయి?
- జీవీఎంసీ ఇచ్చిన కోటిన్నర ఏమైంది?
- గోతులకు బలైపోయిన రెండు నిండు ప్రాణాలు
- రోడ్డు విస్తరణ పేరుతో గోతులు పూడ్చడంలో జాప్యం
- ఒక ప్రజా ప్రతినిధి అడిగిన కమీషన్‌కు భయపడి చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- దాంతో నిలిచిపోయిన గోతుల పూడ్చివేత

(విశాఖపట్నం, రీజనల్ బ్యూరో చీఫ్)

ఈ రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే అత్యంత సాహసం చేయాల్సిందే. ప్రాణాలకు తెగించి మరీ ప్రయాణం చేయాలి.... ఈ రోడ్డుమీద గోతులు తప్ప సవ్యమైన రోడ్డు ఒక అడుగు కూడా కనిపించదు. ఈ రోడ్డుమీద గోతులు మాత్రమే ఉంటాయి.. కనీసం వెతుకుదాం అన్నా లైట్లు కనిపించవు. రాత్రిపూట ప్రయాణం చేస్తే గమ్యం చేరే దాకా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిందే. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టని ఇంతటి దిక్కుమాలిన రోడ్డు నగరం మొత్తం మీద ఎక్కడా ఉండదు. . సుమారు ఎనిమిది కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డులో కొంత భాగం జీవీఎంసీ పరిధిలో, మరి కొంత భాగం ఆర్ అండ్ బి పరిధిలోకి వస్తుంది. ఎవరు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలో తేల్చుకోలేక ఈ విషయాన్ని దాదాపు బాధ్యులందరూ పక్కన పెట్టేశారు. నిత్యం వేలాది మంది ఈ రోడ్డుమీద



ప్రయాణం చేస్తూ ఉంటారు. ప్రతిరోజు ఈ రోడ్డుమీద ఒకటి రెండు ప్రమాదాలు జరగటం సర్వసాధారణం అయిపోయింది. నరకానికి మార్గంగా మారిన ఈ రోడ్డును బాగు చేయాలన్న ఆలోచన పెద్ద మనుషులకు రాకపోవడం దురదృష్టకరం. చాలా కాలం కిందట ఈ రోడ్డులో సాధారణ మరమ్మతులు చేయడానికి అప్పటి ప్రభుత్వం కోటి యాభై లక్షల రూపాయలు మంజూరు చేసింది. అయితే ఆ మొత్తం తో ఎక్కడ గోతులు పూడ్చారో ఎవరికీ (తరువాయి 2వ పేజీలో)

## జీవీఎంసీకి వాంటెడ్
# కమిషనర్..!




- నాలుగు నెలలుగా పోస్టు ఖాళీ
- భర్తీపై దృష్టి సారించని ప్రభుత్వం
- ఇంచార్జ్‌తో నెట్టుకొస్తున్న వైనం
- గాడి తప్పిన పరిపాలన

(మేజర్ న్యూస్, సిటీ ప్రతినిధి)

వాంటెడ్ కమిషనర్. ఇది పత్రికల్లో వచ్చే క్లాసిఫైడ్ యాడ్ అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత కీలకమైన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్ లేరు. రోజులు కాదు.. నాలుగు నెలల నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. కూటమి ప్రభుత్వానికి ఒక ఐఏ ఎస్ అధికారే దొరకలేనట్లు.. ఇన్నాళ్లూ ఇంచార్జ్‌తోనే నెట్టుకొస్తుండడం గమ నార్హం. జిల్లా కలెక్టర్ తరువాత ఆ స్థాయి హోదా, అత్యంత ప్రాధాన్యమైన, అత్యవసరమైన కమిషనర్ పోస్టును జనవరి నుంచి నియమించకపోవడం జీవీఎంసీ ప్రాధాన్యతను తగ్గించినట్లే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### గ్రేటర్‌పై నిర్లక్ష్యమా?

జీవీఎంసీ పరిధిలో 681 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణముంది. 8 జోన్లు విస్తరించిన ఉన్న పరిధిలో 2011 గణాంకాల ప్రకారం సుమారు 21 లక్షల మంది వరకు జనాభా ఉన్నారు. (తరువాయి 2వ పేజీలో)

## రంగశీల గ్రామ సచివాలయంలో
# రికార్డులు మాయం

- సూత్రధారి గతంలో పనిచేసిన సచివాలయ కార్యదర్శి
- పాత్రదారులు హుకుంపేట ఎంపీడీవో అధికారులు



(హుకుంపేట/ మేజర్ న్యూస్)

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం రంగశీల గ్రామ సచివాలయంలో రికార్డులు మాయమయ్యాయి.. గత కొన్నేళ్ళుగా రికార్డులు కనిపించకుండా పోయినా అధికారులు (తరువాయి 2వ పేజీలో)

## చినముషిడివాడ 'అక్రమ నిర్మాణం'పై
# అధికారులది తలో మాట

- ఆక్రమిత స్థలాన్ని వెనక్కి తీసుకుంటామన్న ఎమ్మార్వో
- సెలవుపై వెళ్ళాను నన్నేమి అడగద్దన్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ
- కలెక్టర్ జోక్యం చేసుకోపోతే రెండు కోట్ల స్థలం అన్యాక్రాంతం!

**విశాఖపట్నం, మే 13, మేజర్ న్యూస్:** పెందుర్తి నియోజకవర్గం చినముసిడివాడ గ్రామం లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న భవంతిని నిలుపుదల చేసేందుకు పూనుకోవ లసిన అధికారులు ఆ నిర్మాణ జోలికి వెళ్లడానికి



ఇష్టపడటం లేదు. దీనికి రాజకీయ ఒత్తిడిలే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. సర్వే నెంబర్ 113 లో సుమారు 250 గజాల ప్రభుత్వ స్థలంలో రాజకీయ, ఆర్థిక పలుకుబడి ఉన్న ఒక వ్యక్తి అతిపెద్ద భవంతిని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. నకిలీ పత్రాలు సృష్టించి మరి నిర్మాణాలు సాగిస్తున్నారని ఆరోపణలు తీవ్రంగా ఉన్నప్పటికీ కూటమి పెద్దల బెదిరింపులతో అధికారులు వెనకడుగు వేస్తున్నారు.

ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఒక్కో అధికారి ఒక్కోరకమైన మాట చెబుతున్నారు. సుమారు రెండు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించే విషయంలో అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు అన్నది అర్థం కావడం లేదు. ఈ వ్యవహారానికి సంబంధించి ఎమ్మార్వో, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసిపి, బిల్డర్ వివరణలు ఏ విధంగా ఉన్నాయో జిల్లా కలెక్టర్, ఇన్చార్జి కమిషనర్ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. (తరువాయి 2వ పేజీలో)

## భోగాపురం-రాంబిల్లి మధ్య సెమీ రింగ్‌రోడ్‌కు ప్రతిపాదనలు




**విశాఖపట్నం, మే 13, మేజర్ న్యూస్:** సుమారు 85 కిలోమీటర్ల పొడవున అనకాపల్లి, పెందుర్తి, ఆనందపురంలను అనుసంధానిస్తూ మరీ ముఖ్యముగా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా భోగాపురం మరియు రాంబిల్లి మధ్య 4,6,8 వరసల రహదారుల ప్రతిపాదిత గ్రీన్ ఫీల్డ్ యాక్సెస్ నియంత్రణ సెమీ రింగ్ రోడ్ వీసీఎఫ్- వాల్యూ క్యాప్చర్ ఫైనాన్స్ ఆధారంగా నిర్మించే చర్యల్లో భాగముగా సర్వే నిర్వహణ, సన్నద్ధత, లేఅవుట్ ఖరారు, సాంకేతిక, ఆర్థిక తదితర అంశాలపై డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసేందుకు గాను వీఎంఆర్డీఏ కన్సల్టెంట్ నియమానికి ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానించారు. ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం చుట్టుపక్కల ప్రాంతాల పట్టణీకరణ దృష్టిలో ఉంచుకొని ప్రధాన కేంద్రాలైనటువంటి అచ్యుతాపురం నుండి భోగాపురం బీచ్, రాంబిల్లి మరియు సమీప ప్రాంతాల మధ్య రద్దీని తగ్గిస్తూ ప్రయాణ సమయం తగ్గించటం, మెరుగైన రవాణా సదుపాయాల కల్పన, విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా బాహ్య ప్రాంతాలతో అనుసంధానించటం, సంపూర్ణ రవాణా సదుపాయానికి ఇప్పటికే అభివృద్ధిపరచబడిన 6 వరసల జాతీయ రహదారికి అనుసంధానించటం, తీరప్రాంత ప్రాంతాల మధ్య సంబంధాన్ని మెరుగుపరిచి, పర్యాటక రంగానికి ఊతమిచ్చి తద్వారా ఆర్థిక వృద్ధికి ప్రోత్సాహం కల్పించడం, దీని ద్వారా విశాఖపట్నం ప్రాంతాభివృద్ధికి అనుగుణంగా దీర్ఘకాలిక దృష్టితో ఈ ప్రాజెక్ట్ రూపొందించబడుతుందని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## వీధి విక్రయదారుల సర్వేకు సహకరించాలి: మల్లయ్యనాయుడు

**విశాఖపట్నం, మే 13, మేజర్ న్యూస్:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ మరియు విశాఖ పట్నం జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు స్ట్రీట్ వెండర్ సర్వ్ 2025 సంబంధించి జోన్-4 పరధిలో వార్డు నెంబర్ 28 నుండి 39 వార్డుల వరకు గల వీధి విక్రయ వర్తక వ్యాపారులు అందరికి సర్వే నిర్వహించనున్నట్లు నాల్గవ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జోన్-4, సూర్యబాగ్ పరధిలో ఉన్న జి.వి.యం.సి సచివాలయ సిబ్బందిచే వీధి విక్రయ వర్తక వ్యాపారులులకు సర్వే నిర్వహిస్తున్నామని, సంబంధిత వర్తకులు అందరు ఈ సర్వేకు సహకరించాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ సర్వేకు సంబంధించిన అప్లికేషన్లు 28 నుండి 39 వార్డుల పరధిలో ఉన్నటువంటి అన్ని సచివాలయములలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ సర్వే నిమిత్తం సంబంధిత సచివాలయ సిబ్బంది మీ వద్దకు వచ్చినపుడు ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మీ పరిధిలో ఉన్నటువంటి సచివాలయము సిబ్బందిని సంప్రదించి సర్వ్‌ను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సర్వేకు సమర్పించవలసిన ధ్రువపత్రములు: ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, మొబైల్ నెంబర్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్ కాపీ, మ్యాక్సి సైజు ఫ్యామిలీ ఫోటో పైన తెలిపిన ధ్రువపత్రములు సిద్ధముగా ఉంచిన యెడల సర్వే చేయుటకు సచివాలయం సిబ్బంది మీ వద్దకు వచ్చి సర్వే పూర్తి చేసి మీకు స్ట్రీట్ వెండర్ కార్డు అందచేయటం జరుగుతుందన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

## వేపగుంట-పినగాడి వయా నరకం

తెలియదు. మంజూరైన డబ్బు ఎక్కడికి పోయిందో కూడా ఇప్పటికీ అంతు పట్టదు. ఆ తర్వాత మరికొన్ని నిధులు తెప్పించుకుని అక్కడక్కడ గోతులు పూడ్చి మ.మ. అనిపించారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డును రెండువైపులా కాస్తంత విస్తరించి మరమ్మతులు చేపట్టాలని ఆలోచించి సుమారు 14 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. అప్పటి మంత్రి గుడివాడ అమర్నాథ్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం కూడా జరిగిపోయింది. అంతే... ఆ తర్వాత ఈ రోడ్డు మీద కనీసం తారు కూడా వేయలేదు. శంకుస్థాపన జరిగిన తర్వాత కూడా ఎందుకు ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టలేదు అని ఆరా తీస్తే.. అప్పట్లో ప్రజా ప్రతినిధి ఈ రోడ్డు కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్ దగ్గర నుంచి పెద్ద ఎత్తున కమిషన్ అడిగారు అని తేలింది. ఆయన అడిగిన కమిషన్ ఇస్తే ఉన్న మొత్తం డబ్బుతో పావు వంతు రోడ్డు కూడా బాగు చేయ్యలేమని నిర్ణయించుకుని.. ఆ ప్రజా ప్రతినిధి ఒత్తిడిని తట్టుకోలేక కాంట్రాక్టర్ చేతులెత్తేసి వెళ్లిపోయాడు. అప్పటినుంచి ఈ రోడ్డు రోజురోజుకూ గోతులను పెంచుకుంటూ ప్రమాదాలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తోంది.

### రోడ్డు విస్తరణ సాధ్యమా!

ఇదిలా ఉండగా ఈ రోడ్డు మీద ఉన్న గోతులు పూడిస్తే చాలు మహాప్రభో అని మొరపెట్టుకుంటున్న జనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు మరో షాకిచ్చారు. ఈ రోడ్డును బాగు చేయటం కన్నా 150 అడుగుల మేర విస్తరించి ప్రజలకు మహత్భాగ్యాన్ని కల్పిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పుకొచ్చారు. దీంతో అక్కడి ప్రజలు భయపడి తమ ఇళు ్ళ, దుకాణాలు ఎక్కడ పోతాయో అని కొంతమంది కోర్టుకెక్కినట్టు తెలుస్తోంది. దీంతో విస్తరణ కార్యక్రమం కూడా మీమాంసలో పడింది. ఈ రోడ్డుని విస్తరించి 150 అడుగులు రోడ్డుగా మార్చాలన్న ఆలోచన మంచిదే అయినా, విస్తరణ చేపడితే మేహాద్రిగడ్డ మీద ఉన్న బ్రిడ్జిని మరింత విస్తరించాలి. అలాగే రైల్వే వంతెనను కూడా విస్తరించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి సంవత్సరాల సమయం పడుతుంది. . ఈలోగా ఉన్న రోడ్డు కూడా మరింత గోతులు మయంగా మారి ప్రమాద తీవ్రతను పెంచే అవకాశం ఉంది. విస్తరణ సంగతి పక్కన పెట్టి ముందు ఈ రోడ్డు మీద ఉన్న గోతులు పూడ్చితే ప్రజల ప్రాణాలకు అయినా కొంత భరోసా ఉంటుంది. లేకుంటే ప్రజల ఆగ్రహాన్ని అధికారులు అయినా ప్రజా ప్రతినిధులైన చవిచూడక తప్పదు.

## జీవీఎంసీకి వాంటెడ్ కమిషనర్

రూ.4,500 కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో అతి పెద్ద కార్పొరేషన్‌గా గుర్తింపు పొందింది. ఏటా రూ.వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న జీవీఎంసీ కమిషనర్ పోస్టును నాలుగు నెలలుగా భర్తీ చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన గ్రేటర్ మేయర్ పీఠంపై పెట్టిన శ్రద్ధ కమిషనర్ నియామకంపై పెట్టలేనట్లు కనిపిస్తోంది. రాజకీయ పదవిని చేజిక్కించుకోడానికి వ్యూహాలు పన్నిన ప్రభుత్వం కీలకమైన కమిషనర్ పోస్టు భర్తీపై పెట్టలేదన్న అపవాదును మూటగట్టుకుంటోంది. జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న పి.సంతప్‌కుమార్‌ను ఈ ఏడాది జనవరి 21వ తేదీన బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సీడీఎంఏ)గా నియమించింది. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించింది. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. పూర్తి స్థాయి కమిషనర్‌గా ఎవర్నీ నియమించలేదు.

### పర్యవేక్షణ కరువు

ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన నుంచి విశాఖ అభివృద్ధి వరకు అన్నింట్లోను జీవీఎంసీ పాత్ర కీలకం. పారిశుధ్యం నుంచి మంచి నీటి సరఫరా వరకు జీవీఎంసీయే బాధ్యత వహించాల్సి ఉంటుంది. జీవీఎంసీకి ఇంచార్జ్‌తోనే నెట్టుకొస్తుండడంతో పర్యవేక్షణ కరువైంది. పారిశుధ్యాన్ని పట్టించుకున్న నాధుడే లేకుండా పోయారు. ప్రధానంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు లేకపోవడంతో నగరంలో పారిశుధ్య నిర్వహణ దారుణంగా తయారైంది. అలాగే వేసవి సమయంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలి. కింది స్థాయి అధికారులకు అందుకు అనుగుణంగా సన్నద్ధం చేయాలి. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా కార్యాచరణ సిద్ధం చేసిన దాఖలాలు లేవు. కలెక్టర్‌కు ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ.. జీవీఎంసీపై మాత్రం పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించడం లేదు. జిల్లా బాధ్యతల్లో ఉండే కలెక్టర్ జీవీఎంసీకి సంబంధించి అత్యవసర ఫైళ్ల మినహా మిగిలిన వాటి జోలికి పోవడం లేదు. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటే ప్రతి రోజూ క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లు, రోడ్లు, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

## రికార్డులు మాయం

మిన్నకున్నారు. కీలకమైన రికార్డులు కనిపించకపోతే అధికారులు ఏమి చేయాలి.? రికార్డులో ఏ విధంగా మాయమైనది విచారణ చేపట్టాలి.. పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయాలి.. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాలి.. కానీ ఇక్కడ అవేమీ జరగలేదు.. అన్నీ తెలిసికూడా హుకుంపేట అధికారులు మౌనం వహించడంలో ఆంతర్యం ఏమిటి..? కీలక రికార్డులు అదృశ్యమైన విషయం హుకుంపేట మండల అధికారులకు తెలిసినప్పటికీ ఈ విషయాన్ని భయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. రికార్డులు మాయం వెనక అనేక అవకతవకలకు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలకు బలం చేకూర్చుతూ నిభందనలకు విరుద్ధంగా రికార్డుల్లో తారుమారులు జరిగాయంటూ పలువురు ఎంపీడీవో కార్యాలయానికి పిర్యాదు కూడా చేశారు. అయితే ఈ విషయాన్ని భయటకు పొక్కకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా రికార్డుల మాయం వెనుక సూత్రదారిని కాపాడటానికిగాను, ఈ వ్యవహారంపై ఎటువంటి విచారణ జరపకుండా అధికారులు ప్రక్షక పాత్ర పోషిస్తున్నారు.

వాస్తవానికి రికార్డుల మాయం వెనుక గతంలో ఇక్కడ పనిచేసిన గ్రామ సచివాలయ కార్యదర్శి హస్తం ఉందని తెలుస్తుంది. అంతేకాదు సదరు కార్యదర్శి రికార్డుల్లో చేసిన పలు అవకతవకల్లో ఎంపీడీవో కార్యాలయ అధికారులు కూడా బాగస్వాములు అయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. రికార్డుల మాయం వ్యవహారంపై ప్రజలు ప్రశ్నించినా.. పిర్యాదులు చేసినా.. ఎంపీడీవో కార్యాలయ అధికారులు తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతకాలంగా గ్రామ సచివాలయ రికార్డుల కోసం సమాచార హక్కు చట్టం అనుసరించి పంచాయితీ రివిజన్ బుక్ రికార్డుల పరిశీలనకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారునికి కూడా హుకుంపేట ఎంపీడీవో కార్యాలయంలో చుక్కెదురైంది. చట్టంలో నిభందనలు విస్మరించి లేనిపోని మాటలు చెపుతూ దరఖాస్తుదారునికి అధికారులు నెలలకొద్ది కాలయాపన చేయించారు. రికార్డుల వ్యవహారం వదిలేయాలంటూ సదరు దరఖాస్తుదారునితో ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి రంగంలోకి దిగి బేరసారాలు కూడా మొదలు పెట్టాడు. దీంతో రికార్డుల మాయం వెనుక గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శితో పాటు ఎంపీడీవో అధికారుల పాత్రపై కూడా ఉందన్న అనుమానాలకు తావిస్తుంది. పాత రివిజన్ బుక్‌తో పాటు రికార్డులు మాయం వెనుక పూర్తిస్థాయిలో విచారణ చేపడితే అధికారులు చేసిన అవకతవకలు భయటకు వస్తాయని స్థానిక ప్రజలు చెపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అధికారులది తలో మాట

### ఎమ్మార్వో వివరణ

చినముసిడివాడ అక్రమ నిర్మాణం పై ఎమ్మార్వో ఆనందరావును 'సూర్య' దినపత్రిక విలేఖరి వివరణ కోరగా అది పక్కా ప్రభుత్వ స్థలం అని, అక్రమ నిర్మాణం జరుగుతోందని తెలిసి రెండుసార్లు ఆ నిర్మాణాలను కూల్చివేసామని తెలియజేశారు. సదరు బిల్డర్ హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని, అయితే తమ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి, అది ప్రభుత్వ స్థలమని నిర్ధారించుకున్నందున తాము కూడా కౌంటర్ ఫైల్ చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఇది కోర్టు బెంచ్ మీదకి రాబోతోందని ఆయన వివరించారు

### టౌన్ ప్లానింగ్ ఏసీపీల జగన్నాటకం

ఇది ఇలా ఉండగా రాజకీయ నాయకులు అడిగిందే తడవుగా వెనక ముందు చూడకుండా, ఒక బిల్డర్ కు ప్రభుత్వ స్థలంలో అతిపెద్ద భవంతిని నిర్మించుకునే అవకాశం కల్పించిన టౌన్ ప్లానింగ్ ఏ.సి.పి మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తాను సెలవులో ఉన్నానని తననేమీ అడగద్దని ఏసిపి సెలవు ఇచ్చారు. ఈయన స్థానంలో వచ్చిన మరో అధికారి, మీడియాకు సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేస్తున్నారు.

### బిల్డర్ వివరణ

రాజకీయ పలుకుబడితో అక్రమ నిర్మాణాన్ని సాగిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బిల్డర్ ను వివరణ కోరగా జీవో నెంబర్ 388 ప్రకారం తమకు రెండు సైట్లు మంజూరయ్యాయని, ఆ స్థలంలోనే తాను భవనాన్ని నిర్మిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఏది ఏమైనా నగరమంతా గుప్పుమంటున్న ఈ అక్రమ నిర్మాణంపై జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ కమిషనర్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## పది కేజీల గంజాయి స్వాధీనం ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**– మూడు సెల్ ఫోన్లు 8000 క్యాష్ స్వాధీనం**



**నర్సీపట్నం, మే 13, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం పట్టణ పోలీస్ స్టేషన్లో నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం పట్టణ పరిధిలో గల గవర్నమెంట్ డిగ్రీ కళాశాల వద్ద పట్టణ ఎస్సై ఉమామహేశ్వరరావు పోలీసు సిబ్బంది మంగళవారం ఉదయం 10 గంటలకు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా N69BB 9074 నెంబర్ గల టాటా ఇండికా కారు చింతపల్లి నుండి నర్సీపట్నం వైపు వస్తుండగా పోలీసులు తనిఖీలు గమనించి కారు ఆపివేసి డ్రైవర్. పక్క వ్యక్తి పరుగులు తీగ ఎస్సై ఉమామహేశ్వర రావు సిబ్బంది వారిని పట్టు కొని విచారణ చేసి కారును పరిశీలించగా కారు వెనకాల సీటులో ప్రత్యేకమైన అర వెల్డింగ్ చేపించి దానిలో ఐదు ప్యాకెట్ల గంజాయిను నింపి ఉండడం గమనించి గంజాయి రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులు అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ తెలిపారు. వీరు తమిళనాడు రాష్ట్రానికి చెందిన కార్తీక్ అందవర్. సొంత కారు డ్రైవర్ దీపక్ వీరు ఇద్దరు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరి వద్ద నుండి 10 కేజీల గంజాయి మూడు సెల్ ఫోన్లు 8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల కాలంలో క్రైమ్ మీటింగులో హోంమంత్రి స్పీకరు పాల్గొనగా నర్సీపట్నం లో డి. ఎడిక్షన్ సెంటర్ మంజూరు చేయాలని సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటుకు సహకరించాలని కోరగా తక్షణమే నిధులు మంజూరు చేయడానికి నాయకులు అంగీకరించారని డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. వీరికి గంజాయి అమ్మిన వ్యక్తి గురించి ఎంక్వయిరీ చేస్తున్నామని తెలిపారు. గంజాయి ముద్దాయిలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారని వారికి ప్రత్యేకంగా రివార్డ్ అందిస్తున్నామని డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు ఈ సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవిందరావు ఎస్సై రమేష్. ఎస్సై ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముషిడిపల్లిలో శతాధిక వృద్ధురాలు మృతి



**దేవరాపల్లి, మే 13, మేజర్‌న్యూస్:** దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గౌరీ కాలనీ కి చెందిన శతాధిక వృద్ధురాలు రాయవరపు ముత్యాలమ్మ (103) మంగళవారం కన్నుమూసింది. చనిపోయే ముందు వరకు చలాకీగా తన పనులు తానే చేసుకునేవారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ముత్యాలమ్మ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. మాజీ సర్పంచ్ లు సోమిరెడ్డి గోవింద, రాయవరపు సాంబమూర్తి, బొడ్డు చిన వెంకట్రావు తో పాటు గ్రామస్థులు ఆమె మృతికి సంతాపం తెలిపారు.

### జాలుమూరి బంగార్రాజు జన్మదిన సందర్భంగా

## తల్లిదండ్రులు విగ్రహాలను ఆవిష్కరించిన స్పీకర్



**నర్సీపట్నం, 13 మే, మేజర్‌న్యూస్:** జాలుమూరి బంగార్రాజు గారి 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని, వారి తండ్రిగారు స్వర్గీయ జాలుమూరి జోగారావు గారు, తల్లి జాలుమూరి నూకరత్నం గారి విగ్రహాలను నర్సీపట్నంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొని, జాలుమూరి బంగార్రాజు గారికి 75వ పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పుడో చనిపోయిన తల్లిదండ్రులను జ్ఞాపకం చేసుకొని వారి విగ్రహాలు ఏర్పాటు చేయటం ఎంతో పుణ్యం అని స్పీకర్ అన్నారు. స్వర్గీయ జాలుమూరి జోగారావు గారు నర్సీపట్నంలో వ్యాపార రంగంలో శ్రీకారం చుట్టిన ప్రముఖులు అని, మా తాతగారు లత్సాపాత్రుడు గారి కుటుంబంతో తాను కలిగిన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా 200 మందికి పైగా పేదల కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్. జనసేన ఇంచార్జ్ సూర్యచంద్ర జాలుమూరి బంగార్రాజు . జె వి ఏ ఎన్ జోగారావు. జె వి రాజ్ కుమార్ .కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతులకు సన్మానం

**– కొండకర్ల గ్రామంలో సమావేశం**



**అచ్యుతాపురం, మే 13, మేజర్‌న్యూస్:** అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతులకు సన్మానం కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయ అధికారి శంకర్ గోవింద్ , గ్రామ పెద్దలు, గ్రామ సంఘం సభ్యులు, మరియు ఉత్తమ రైతులు హాజరుకావడం జరిగింది. ఉత్తమ రైతు భాను ప్రకాష్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూసారం పెరిగి, ఆరోగ్యం మెరుగుపడతుందని, ఖర్చులు తగ్గిపోతాయని, పర్యావరణాన్ని కాపాడే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, రైతులు ఈ వేసవిలో పి ఎం డి ఎస్ పద్ధతిని అనుసరించాలని, నవధాన్యాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.ఉత్తమ రైతులకు సన్మానం చేయబడింది. ప్రకృతి వ్యవసాయం చేస్తూ తమ అనుభవాలను ఇతర రైతులకు పంచుకోవాలని వారికి సూచించబడింది.గ్రామంలో మండల వ్యవసాయ అధికారి, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించబడింది. ఆరు మంది రైతులకు సన్మానం చేయడం జరిగింది.మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ), గ్రామ పెద్దలు, గ్రామ ఆరోగ్య అధికారి (వి ఏ ఏ), ఉపాధి హామీ కార్మిక స్కీమ్ ఎన్ ఆర్ జి ఎస్ సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ (ఏ పి సి ఎన్ ఎఫ్) సిబ్బంది పాల్గొన్నారు.

# కొన్నది గోరంత... ఆక్రమణ కొండంత

- **ప్రభుత్వ భూమిలో దర్జాగా వ్యవసాయ బోరు**
- **గెడ్డను కప్పేసి తనసొంత భూములకు రహదారి**
- **బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్న రెవెన్యూ అధికారులు**





**దేవరాపల్లి, మే 13, మేజర్‌న్యూస్:** కళ్ళ ముందే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న సంబంధిత అధికారులకు కనీసం చీమ కుట్టినట్లయినా లేదని, మామూళ్లకు అలవాటుపడ్డ అధికారులు అటువైపు కన్నెత్తైనా చూడడం లేదని, తప్పని పరిస్థితుల్లో రాజకీయ ఒత్తిడికి తలొగ్గి ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు పెట్టినా దున్నపోతు మీద వాన కురిసిన చందంగా తన పని తాను చేసుకుంటూపోతున్న భూ కబ్జాదారుడు తీరు పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ భూ కబ్జా వ్యవహారాన్ని కప్పి పుచ్చేందుకు లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు గుసగుసలు గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములకు అనుకొని గోరంత భూములు కొన్న యజమానులు కొండంత ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సులువు దొరికితే సూదిలా దూరి..దబ్బలంలా భూ కబ్జాదారులు మారుతున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు దర్జాగా ఆక్రమణలకు గురవుతున్న రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.దీనికి సంబంధించిన వివరాలిలావున్నాయి. మండలం లోని గరిసింగి పంచాయతీ తాటిపూడి సమీపంలో భారీ భూఆక్రమణ చేసి కొండ పోరంబోకు గెడ్డలు, వాగులు కలిపి చదును చేసి ప్రభుత్వ భూమిలో దర్జాగా వ్యవసాయ బోరు వేశారు. వాటిని కాపాడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫల మయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. గరిసింగి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్లు (ఎల్ పి ఎం) 49 లో 11 సెంట్లు భూమి, 78లో 16 సెంట్లు 70, 69, 45 , భూమి, గెడ్డ వాగు ఆక్రమణకు గురైనట్లు అధికారులు రెవిన్యూ గణాంకాల్లో వెల్లడించారు. అలాగే ఆ జిరాయితీ భూమికి అనుకొని ఉన్న మిగిలిన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ బంజరు, గెడ్డ, వాగు, పోరంబోకు, కొండ పోరంబోకు భూముల్లో ఇష్టానుసారంగా రాళ్లను, బండలను నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలతో పేల్చేసి, ఆభూస్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. ఫ్లాట్లుగా పోల్స్ నిర్మించి రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇష్టానుసారం వ్యవహరిస్తున్న తీరు ఆశ్చర్యకరంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయాన ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు నెల రోజులు క్రితమే అదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే.అయిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నది గట్టి ఆరోపణ. కొనుగోలు చేసింది గోరంత అయితే, ఆక్రమించేసిందే కొండంతని స్థానికులు అంటున్నారు. గెడ్డ, వాగులను ఆక్రమించేసి పల్లె గిరిజన వాతావరణంలో కొండలు, గెడ్డలు, వాగులు నుంచి పారే వర్షపు నీరుతో అందంగా కనబడే ప్రకృతిని పూర్తిగా నాశనం చేస్తున్నారని స్థానికులు అందోళన వ్యక్తం చేశారు.రియల్ ఎస్టేట్ వ్యాపారులు దెబ్బకు గెడ్డలు పూర్తిగా అంతరించి పోతున్నాయని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్వ కాలం నుంచి గెడ్డలు, కొండ వాగులు వాటిని అలాగే విడిచి పెట్టడం వలన క్రింది ప్రాంతంలో పంట పోలాలకు చెరువులకు సాగు నీరు అందేదని, వాతావరణ విపత్కర సమయాలలో ప్రజలకు మేలు చేసే గెడ్డలను కూడా ఆక్రమించుకుంటూ పోతే, భవిష్యత్తులో పెను ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. ఈ ప్రాంతంలోని ముందస్తు ప్రణాళిక ప్రకారమే ప్రభుత్వ భూములకు ఆనుకుని జిరాయితీ భూములను కొనుగోలు చేస్తున్నారని, అనంతరం ప్రభుత్వ భూములను ఆక్రమించేస్తు న్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తు న్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి ప్రభుత్వ భూములు అక్రమించేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## నవధాన్యాలు సాగుపై రైతులకు అవగాహన




**బొబ్బిలి,మే 13: మేజర్ న్యూస్:** మండలంలోని మెట్టవలస గ్రామంలో నవధాన్యాల సాగుపై రైతులు అవగాహన కల్పించడం జరిగిందని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాం సుందర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు అనగా వివిధ రకాలైన చిరుధాన్యాలు అపరాలు నూనె గింజలు వంటి విత్తనాలను కొద్దికొద్ది మోతాదులో కలిపి వాటిని ఎకరానికి 10 కేజీలు చొప్పున వేసవికాలంలో లేదా ప్రధానమైన పంట లేనప్పుడు భూమిలో చల్లుకోవాలి. అలాగే భూమిపై ఒక ఆచార్ధన పండగ వేసుకున్నట్టు వలన అధిక సూరి రసం నుంచి భూమిని కాపాడి పంటకు అవసరమైన సూక్ష్మజీవులు నాశనం అవ్వకుండా కాపాడుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతుకు అవసరమైనటువంటి పంటను కోసుకోవడానికి మరియు మూడవది మిగిలిన పంటని భూములో కలియదున్ని భూమిని సారవంతం చేయకు ఉపయోగపడను. కనుక ఈ విధముగా నవధాన్యాల సాగుతో మూడు రకాల ఉపయోగాలు రైతులు కలుగును కాబట్టి ఈ వేసవిలో ఈ నవధాన్యాలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తే వ్యవసాయ శాఖ తరపున అన్ని రకాల పచ్చ రొట్టె ఎరువులను రైతులకు రాయితీపై అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ రీజనల్ కోఆర్డినేటర్ కె ప్రకాష్ మండల వ్యవసాయ అధికారి బొబ్బిలి అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు బి రాజశేఖర్ పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



**బాడంగి, మే 13, మేజర్ న్యూస్:** లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా మే 20న నిర్వ హించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐ టియు బాడంగి మండల కార్యదర్శి ఏ. సురేష్ పిలుపు నిచ్చారు మండలం లోని భీమవరం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మంగళవారం సమావేశం నిర్వహించి, ఆయన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించడంతోపాటు, రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాట ఫలితంగా వచ్చిన 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్ చట్టాలను తీసుకు రావడం అన్యాయమని పేర్కొన్నారు. ఇవి కార్మికుల హక్కులను హరించేందుకు దోహదపడతాయన్నారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, అన్ని రంగాల కార్మికులు, కూలీలు మే 20 సమ్మెలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మురళి, పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## భారతదేశ ప్రాచీన భాష ఉర్దూ భాష

**బొబ్బిలి,మే 13: మేజర్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మరియు సెక్రటరీ వారి ఆదేశాల మే రకు, ఉర్దూ అకాడమీ లైబ్రరీ బొబ్బిలి ఆధ్వ ర్యంలో లిచలో ఉర్దూ లైబ్రరీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎం.ఏ ఖుద్దూస్ మాట్లాడుతూ భారతదేశ ప్రాచీన భాష ఉర్దూ భాష అని, రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూని ద్వితీయ భాష గా గుర్తించిందని చెప్పారు. ఉర్దూ భాషను ప్రజల్లో తీసుకెళ్ళుటకు గాను మరియు ఉర్దూ ప్రేమికులు, ఉర్దూ సాహితివేత్తలు, విద్యార్థులు ఉర్దూ భాష యొక్క ప్రాముఖ్యతను గుర్తించుటకు గాను ఇలాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉర్దూ భాష భారతదేశం యొక్క గౌరవం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షులు సయ్యద్ హాజీ పీరా, మున్సిపల్ కోఆప్షన్స్ సభ్యులు రియాజ్ ఖాన్, హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సభ్యులు షేక్ జాఫర్, హమీద్,సయ్యద్ బాబ్జి, రహీమ్ ఖాన్,జి.ఎం. ఖాన్, మదీనా, షాజాదా, నాగు మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## ప్రతి పంచాయతీలో పారం ఫాండు పనులు నిర్వహించాలి



**నెల్లిమర్ల, మే 13, మేజర్ న్యూస్:** ప్రతి పంచాయతీలోనూ పారం ఫాండు పనులను తప్పని సరిగా నిర్వహించాలని డ్వామా పీడీ ఎస్ శారదాదేవి చెప్పారు. నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం, పెదబూరాడపేటలో మంగళవారం నిర్వహించిన ఉపాధిహామీ పనులను పరిశీలించారు. రెండు పూటలూ ఉపాధి పనులు నిర్వహిస్తే కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. ఉపాధి పనులు ఉదయం 5.30 గంటలు నుంచి 10.30 గంటలు వరకూ మధ్యాహ్నం 4 గంటలు నుంచి 6 గంటలు వరకూ పనులు నిర్వహిస్తే రూ. 307 కూలి వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఓ రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## చెత్తను తొలగించాలి



**బొబ్బిలి, మే 13 , మేజర్ న్యూస్:** శిధిలావస్థలో ఉన్న నూతి గుట్టును తక్షణమే తొలగించాలని సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ ఎల్ రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్ పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ లతో బలిజిపేట రోడ్డు, అగురు వీధి, వరహగిరి వారి సందు చిన్న బజారు మరియు మార్కెట్ ఏరియాలలో పర్యటించారు. అనంతరం బలిజిపేట రోడ్డులో ఖాళీ స్థలంలలో ఉన్న చెత్తను ఏరివేయించాలని, గార్బేజ్ వలనరబుల్ పాయింట్లను క్లియర్ చేయించాలని ఆదేశించారు. అగురు వీధిలో మునిసిపల్ బావి గట్టు తొలగించి ప్రమాదకర స్థితిలో ఉన్నట్లుగా గుర్తించి ఆ బావి యొక్క గట్టు తిరిగి నిర్మించాలని అక్కడ ఉన్న ఇంటి యజమానికి తెలియజేసారు. మార్కెట్ లో చెత్తలను రోడ్ల పైన వేయకుండా డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ నుండి వస్తున్న చెత్తను ప్రతిరోజు ఉదయం 6 గంటలలోగా క్లియర్ చేయించాలని ఆదేశించారు. కాలువలలో సిల్టు తొలగించాలని ఆదేశించారు.




# చదువుతోపాటు ఆటలకూ ప్రాధాన్యత

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్




**విజయనగరం బ్యూరో, మే 13 , మేజర్ న్యూస్ :** క్రీడావిధానంలో మనం ఇతర రాష్ట్రాలకు ఆదర్శకంగా నిలిచామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఒక్క మన రాష్ట్రంలోనే ఉద్యోగాల భర్తీలో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్లు కల్పించామని, క్రీడలకోసం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని చెప్పారు. చదువుతోపాటు ఆటలకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో జరుగుతున్న3వ జాతీయ తైక్వాండో శిక్షణా సెమినార్‌కు మంత్రి శ్రీనివాస్ మంగళవారం హాజరయ్యారు. క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణను తిలకించారు. ఒడిషా, ఛత్తీస్‌ఘడ్, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోచ్‌లు, క్రీడాకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, మానవ వనరులే మన దేశానికి ఆస్తి అని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతోపాటు, ఆటల్లో కూడా రాణించి మన రాష్ట్రానికి, ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. గతంలో కూడా ఆయన హయాంలోనే క్రీడారంగంలో మన రాష్ట్రం ఎంతో పురోభివృద్ధిని సాధించిందని అన్నారు. ప్రతీ



పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించామన్నారు. ప్రతీ జిల్లాలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్, అంతర్జాతీయ క్రీడాకారుడు, తైక్వాండో కోచ్ అబ్బాస్ షేకీ, తెలంగాణా రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీహరి, మక్కువ శ్రీధర్ తదితర ప్రముఖులు, కోచ్‌లు, క్రీడా కారులు పాల్గొన్నారు.

## నిరుపేదలు సాగుచేస్తున్న భూములకు శాశ్వత హక్కు పట్టాలు ఇప్పించండి

**బాడంగి, మే 13, మేజర్ న్యూస్:** మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన ఎస్ సి మాదిగ కుటుంబానికి చెందిన సుమారుగా 100 కుటుంబాలు భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీల మందరం కలిసి సుమారుగా 2006-2007వ సంవత్సరం నుండి సర్వేనెంబర్ 509 మరియు 513లో గల ప్రభుత్వ భూములను సాగు చేసుకుని జీవిస్తున్నామని ఆ సాగు చేస్తున్న భూమి మీద మామిడి, జీడి తోటలు, వేసుకొని జీవిస్తున్నామని ఆభూములను నిరుపేదలమైన సాగు చేస్తున్న మా అందరకు శాశ్వత భూమి హక్కు పట్టాలు ప్రభుత్వం ఇప్పించాలని కోరుతూ మంగళవారం సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి



అలమండ ఆనందరావు ఆధ్వర్యంలో కోడూరు గ్రామానికి చెందిన కే రాజు, కే జోజి, భోగి సంజీవి,లు బాడంగి తాసిల్దార్ సుధాకర్ కు వినతి పత్రం అందించారు.




## కోదండ రాముని దర్శించుకున్న ఎమ్మెల్యే ఎంజీఆర్



**మెలియాపుట్టి, మే 13, మేజర్‌న్యూస్:** మెలియాపుట్టి మండలం గొప్పిలి గ్రామంలో నూతనమగా నిర్మించిన శ్రీ కోదండరామ ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. జైశ్రీరామ్ అంటూ జెండపట్టుకుంటూ ఎమ్మెల్యే ఎంజీఆర్ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల నిర్వహించే యజ్ఞ ,హెూమాలలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి 25,000/- వేల రూపాయలు విరాళం ఎమ్మెల్యే అందించారు.అలాగే ఆలయ అభివృద్ధి కొరకు ఆలయ అర్చకులకు ప్రతినెల దీప దుపా నైవేద్యాల కోసం (10,000/-)ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహన్ రావు, మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్ రెడ్డి , గ్రామ సర్పంచ్ పల్లి జయసుధ యోగి,ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## “శివ్వాలను’ సత్కరించిన ‘పేడాడ”



**ఆమదాలవలస, మే 13, మేజర్‌న్యూస్:** పదవులను భర్తీ చేయడంలో కూటమి ప్రభుత్వం సమర్ధవంతంగా వ్యవహరించి, సీనియారిటీ, పార్టీ సేవలను గుర్తించి సమర్ధులకు పదవులను అందించిందని విశ్రాంతి తహశీల్దార్, కాళింగ సంఘ, టిడిపి నాయకుడు పేడాడ జనార్ధనరావు అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా ఇటీవల నియమయకమైన శివ్వాల సూర్యంను షలంత్రి గ్రామములో మంగళవారం కలిసి శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమర్ధవంతమైన నాయకులని అన్నారు. కార్పొరేషన్, నామినేటెడ్ పదవులను సమర్ధులతో నింపారని కొనియాడారు. సూర్యం రైతులుకు సకాలంలో రుణాల అందించి వారికి ఆర్ధిక చేయూతను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిల్లి శేషు, ఎస్. వెంకటరావు, చింతాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కర్లెమ్మ రైతులకు న్యాయం చేయండి



**కొత్తూరు, మే 13, మేజర్‌న్యూస్:** అన్యాయని గురైన కొత్తూరు మండలం కర్లెమ్మ రెవిన్యూ రైతాంగానికి న్యాయం చేయాలని కొత్తూరు తహసీల్దార్ కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాం లో చేపట్టిన భూముల సర్వేలో జరిగిన అక్రమాలు వలన రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రసాద్ , తహసీల్దార్ బాలకృష్ణ కు వివ రించారు. ఒకరి భూములు మరొకరి పేరున నమోదు చేశారని, ఒక పట్టానెంబర్ లో ఉన్న రైతు భూమిని ఇద్దరి పేరున నమోదు చేశారని, పేరు రైతుది, భూమి మరొకరి పేరున నమోదు చేశారని సిర్ల అన్నారు. ఈ విధంగా కర్లెమ్మ రెవిన్యూ లో ఎనభై శాతం అక్రమాలు జరిగాయని, తక్షణమే వాటిని సరిదిద్ది రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## ఉపాధి హామీకి వ్యవసాయం అనుసంధానం చేయండి

- రైతుల ఆత్మీయ సమ్మేళణ సమావేశంలో మేధావులు విజ్ఞప్తి
- విజయవాడ రైతు ఆత్మీయ
- సమ్మేళనానికి లోతుగెడ్డ



**కొత్తూరు, మే 13, మేజర్‌న్యూస్:** విజయవాడ లో నిర్వహించిన రైతు ఆత్మీయ సమ్మేళనానికి మండల పరిషత్ నేత రైతు నాయకులు లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు పాల్గొన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మరియు నూతన వ్యవసాయ విధానం పై ఆత్మీయ సమావేశం లో పలు అంశాలు పై చర్చించినట్లు ఆయన వెల్లడించారు.ఈ సమావేశానికి అక్కినేని భానుప్రసాద్ అధ్యక్షత వహించగా మాజీ వ్యవసాయ శాఖ మంత్రి , పార్లమెంట్ మాజీ సభ్యులు వడ్డే శోభనాదీశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే రామయ్య తదితర మేధావులు వ్యవసాయ సమస్యల పై సమావేశంలో చర్చించినట్లు లోతుగెడ్డ తెలియ జేశారు.ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, నీటి ప్రాజక్ట్ లు పరిస్థితులు సమావేశం దృష్టి కు తీసుకొని వెళ్లినట్లు తులసీ వర ప్రసాదరావు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయం ఉపాధి హామీ పథకం తో అనుసంధానం చేయాలనీ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.వంశధార నాగావళి నదులు అనుసంధానం కోసం చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్రలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజక్టులు పూర్తి చేయడం పై చర్చించినట్లు తెలిపారు, లాభసాటి వ్యవసాయం , రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కోసం సమావేశంలో చర్చించడమే కాకుండా ప్రతిపాదన తో సమావేశం లో ఏకగ్రీవ తీర్మాణం చేసినట్లు వెల్లడించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసేందుకు ఉపాధి హామీ పథకం తో వ్యవసాయం అనుసంధానం చేయాలని పలువురు మేధావులు సూచించినట్లు తులసీ వర ప్రసాద రావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి గా ఆత్మీయ సమ్మేళనానికి హాజరైనట్లు లోతుగెడ్డ తెలిపారు.సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించిన తీర్మానాలను రాష్ట్ర ప్రభుత్వానికి రైతు నాయకులు రిప్రజంటేషన్ చేయనున్నట్లు వెల్లడించారు.అదేవిధంగా రైతు నాయకులు సాగు నీటి ప్రాజక్టులు సందర్శిస్తారని లోతుగెడ్డ తెలిపారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



**మెలియాపుట్టి, మే 13, మేజర్‌న్యూస్:** రైతుల భూములు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం కౌలు రైతుల గుర్తింపు కార్డులు మంజూరు చేస్తుందని మెలియాపుట్టి తాసిల్దార్ బి.పాపారావు అన్నారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దారు బి. పాపారావు గారి అధ్యక్షతన గ్రామ రెవెన్యూ అధికారులు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులకు కౌలుదారు గుర్తింపు కార్డులు,అన్నదాత సుఖీభవ వెరిఫికేషన్ పైన శిక్షణా కార్య క్రమము నిర్వహించారు. కౌలుదారు రైతులు విధిగా రైతు సేవా కేంద్రం పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా గ్రామ రెవెన్యూ అధికారికి దరఖాస్తు చేసుకొని కౌలు దారు రైతు కార్డు పొందవచ్చునని తెలియజేశారు. కౌలుదారు కార్డు భూమి సాగు హక్కు పత్రం పొందిన రైతులకు ప్రభుత్వం నుండి పథకాలు పొందుటకు అర్హులవుతారని తెలియ జేశారు. అలాగే ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదా త సుఖీభవ పథకానికి రైతులు యొక్క భూమి వివరాలు త్వరిత గతిన వెరిఫి కేషన్ చేయించాలన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి భూమి వివరాలను వెరిఫికేషన్ చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి ఎస్. దాన కర్ణుడు, డిప్యూటీ తాసిల్దార్ రాము, వ్యవసాయ విస్తారనాధికారి ప్రభావతి, సీనియర్ నాయకులు జగన్ మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రయోజనాల కోసమే అక్రమ కేసులు

- అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం ..
- అక్రమ కేసులో బాధితులైన వైసీపీ నాయకులను పరామర్శించిన తిలక్



**సంతబొమ్మాళి, మే 13, మేజర్‌న్యూస్:** రాజకీయ ప్రయోజనాల కూటమి కోసమే వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు పై అక్రమ కేసులు పెడుతున్నారని ఎవరు అధైర్యపడ “వద్దని ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ భరోసా ఇచ్చారు. ఇటీవల తెలుగుదేశం కూటమి నాయకులు పెట్టిన అక్రమ కేసుల్లో అరెస్టై బెయిల్ పై విడుదలైన సంతబొమ్మాళి మండలం శ్రీ జగన్నాధపురం గ్రామ సర్పంచ్ రాములమ్మ వైఎస్ఆర్సిపి నాయకులు ఎల్.రామా రావు, కె.రామారావు కుటుంబ సభ్యులను మంగళవారం తిలక్ పరామర్శించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడు ప్రోత్సాహంతో పోలీసులు వైఎస్ఆర్సిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. శ్రీజగన్నాధపురం లో టిడిపి వర్గాల మధ్య జరిగిన గొడవల్లో వైఎస్ఆర్సిపి మహిళ సర్పంచ్ పైన గ్రామంలో లేని వైఎస్ఆర్సిపి కార్యకర్తల పైన కేసులు బనాయించడం హేయమైన చర్యని అన్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్న వారు, వీటికి ప్రోత్సహిస్తున్నవారు తగిన మూల్యం చెల్లించకోక తప్పదని తిలక్ హెచ్చరించారు. రాబోయేది వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అని, జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్యాయంగా వైఎస్సార్సీపీ కార్యకర్తలను నాయకులు ఇబ్బందులు పెడుతున్న వారిని వదిలిపెట్టేదే లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు గాను కార్యకర్తలకు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్ని కేసులు పెట్టిన ధైర్యంతో ముందుకెళ్లి కూటమి ప్రభుత్వంపై పోరాటం చేయడం జరుగుతుందని, కార్యకర్తల కోసం తాను నిరంతరం అండగా ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని ఎవరు అధైర్య పడోద్దని తిలక్ కోరారు. ప్రశాంతంగా ఉన్న తీర ప్రాంతంలో రాజకీయ కక్షలకు ప్రోత్సహించడం తగదన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు బుడ్డా మోహన్ రెడ్డి,మాజీ ఏ.ఎం. సి ఛైర్మన్ సుగ్గు రామిరెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు ఎన్ని మన్మథ రావు,నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ మూర్తి, టెక్కలి ఎంపీపీ ప్రతినిధి ఆట్ల రాహుల్,కోటబొమ్మాళి జడ్పీటీసీ దుబ్బ వెంకట రావు,సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి వైఎస్ఆర్సిపి మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ శిరిడి సాయి మందిరం భజన సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం




**నరసన్నపేట, మే 13, మేజర్‌న్యూస్:** శ్రీ శిరిడి సాయి మందిరం భజన సేవా సంఘం ఆధ్వర్యంలో నరసన్నపేట సోమవారం సంత ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా మజ్జిగ పంపిణీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అధ్యక్షులు గొండు స్వామి బాబు. వందలాది మందికి మజ్జిగను అందించి వారి దాహార్తిని తీర్చారు. సుమారు యాభై లీటర్ల పెరుగును మజ్జిగకలిపి భజన బృందం సభ్యులు స్థానిక సంత ప్రాంగణంలో ఉదయము నుండి అందజేశారు. ఈ సందర్భంగా శిరిడి సాయి మందిరం భజన సేవ సంఘం అధ్యక్షులు గొండు స్వామిబాబు మాట్లాడుతూ నేటి నుండి ప్రతి సోమవారం సంత ప్రాంగణంలో చలివేంద్రాన్ని నిర్వహిస్తామని, అందరికీ మజ్జిగ అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తామని పెరుగుతున్న వేసవి దృశ్య చల్లని మజ్జిగ, చల్లని నీరు అవకాశం ఉన్నంత మేరకు ఎక్కువగా తీసుకోవాలని, లేనియెడల వడదెబ్బ సంభవించే అవకాశం ఉంటుందని, శిరిడి సాయి మందిరం భజన సేవ సంగం సభ్యులందరి సహకారంతో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పొట్నూరు నీలం( గౌరవ అధ్యక్షులు ), డాక్టర్ గొండు స్వామి బాబు( అధ్యక్షులు) బోయిన ఆనందరావు (కార్యదర్శి ), వి. భాస్కరరావు, కే. పాపారావు, వి.నాగేంద్ర, ఏ. వసంత కుమార్, శివ, టి. ఆనంద్, డి. గణేష్, టీ వల్లయ్య, యు. చిన్నారావు, బి. నగేష్, జి. రాంజీ మొదలగు వారు పాల్గొన్నారు.ా

## ప్రధాని మోడీ కోసం తోటపల్లిలో ప్రత్యేక పూజలు



**గుమ్మలక్ష్మీపురం, మే 13 (మేజర్ న్యూస్):** ఆపరేషన్ సింధూర్ పాకిస్తాన్ పై మనం చేస్తున్న ధర్మ యుద్ధంలో సైనికులకు, భారతీయులకు, మన భారతదేశాన్ని సురక్షితంగా ఉంచడం కోసం శ్రమిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి నైతిక మద్దతుగా దైవ బలం కూడా మెండుగా ఉండాలని జనసేన పార్టీ కురుపాం నియోజకవర్గం సమన్వయకర్త కద్రక మల్లేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం జనసేన పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తోటపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ, జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం మంగళవారం కురుపాం నియోజకవర్గం లో ప్రసిద్ధిగాంచిన ఉత్తరాంధ్ర చిన్న తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ ఏడుకొండల వెంకటేశ్వర స్వామి యొక్క దివ్య ఆశీస్సులు భారత త్రివిదదల సైనికుల మీద, భారత దేశ యావన్మంది ప్రజల మీద, ప్రధానికి ఆ దైవబలం చేకూరాలని ప్రత్యేక పూజలను నిర్వహించామన్నారు.ఒక మంచి పనికి ముందుకు వెళ్లేందుకు దైవభక్తి కూడా సహాయ పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ గార గౌరీ శంకర్రావు గారు, కొమరాడ మండల అధ్యక్షులు తెంటు శ్రీకర్, గరుగుబిల్లి మండల అధ్యక్షులు బోను శివ, ఉమ్మడి విజయనగరం కార్యనిర్వహణ కార్యదర్శి వాన ఉపేంద్ర, నియోజకవర్గం నాయకులు అధికారి అనిల్, తాడేళ్ళ శ్రీరామ్, భోగి తారక్, జనసేన నాయకులు, కార్యకర్తలు అప్పలనాయుడు, గంగ నాయుడు, బర్ల పండు,జన సైనికులు,వీరమహిళలు పాల్గొన్నారు.

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



**పూసపాటిరేగ, మే 13,మేజర్ న్యూస్:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు శంకర్రావు తెలిపారు. జీపు జాత కార్యక్రమంలో భాగంగా మండలంలోని జి చోడవరం మహిళా పరిశ్రమ వద్ద గేటు సమావేశం సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావు మాట్లాడుతూ ఈనెల 20న దేశవ్యాప్తంగా జరుగునున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులందరూ ఐక్యంగా విజయవంతం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వై నా బిజెపి కార్మిక చట్టాలను కాలరాశి పాత చట్టాల స్థానంలో కొత్త చట్టాలను రూపొందించడం వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దేశంలో ఎంతోమంది కార్మికులు పరిశ్రమల ఆధారంగా జీవించిన వారికి నూతన కార్మిక చట్టాల వలన వారి జీవన ప్రమాణాలపై తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు.కొత్త కార్మిక చట్టాల వలన కార్మికుల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది అన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ జాతా కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తో పాటు మైలాన్ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్మికులు, పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రదర్శనగా చీకటి పువ్వు

- **కొత్త పరిమళంకి ద్వితీయ**
- **రైతే రాజుకి తృతీయ అవార్డులు**
- **అట్టహాసంగా ముగిసిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు**







**చీపురుపల్లి మే,13 మేజర్ న్యూస్:** గరివిడి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు శ్రీరాం నగర్ శ్రీరాం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు అట్టహాసంగా ముగిసాయి. పోటీల్లో తెలంగాణ నుండి నాలుగు, ఆంధ్రప్రదేశ్ నుండి నాలుగు నాటక సంస్థల కళాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా కరీంనగర్ చైతన్య కళా భారతి సంస్థ కళాకారులు నటించిన చీకటి పువ్వు నాటిక కు ఉత్తమ ప్రదర్శన గా అవార్డు లభించింది. ద్వీతీయ ఉత్తమ ప్రదర్శనగా శార్వాణి గ్రామీణ గిరిజన సేవా సంస్థ ప్రదర్శించిన కొత్త పరిమళం బహుమతి గెలుపొందింది. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్ కలాంజలి సంస్థ ప్రదర్శించిన రైతేరాజు నాటిక నిలిచింది. ఉత్తమ(చీకటి పువ్వు) ప్రదర్శనకు 40 వేలు నగదు,జ్ఞాపిక, ద్వితీయ ఉత్తమ ( కొత్త పరిమళం)ప్రదర్శన కు 37 వేలు నగదు,జ్ఞాపిక, అలాగే తృతీయ ఉత్తమ (రైతే రాజు)ప్రదర్శన కు 35 వేలు నగదు,జ్ఞాపీక అందించారు.ఉత్తమ నటుడు మెట్ట పొలినాయుడు (కొత్త పరిమళం),ఉత్తమ నటి గుడివాడ లహరి(చీకటి పువ్వు),ద్వితీయ ఉత్తమ నటి బి.నాగ రాణి (చిగురు మేఘం),ఉత్తమ దర్శకుడు రమేష్ మంచాల(చీకటి పువ్వు), ఉత్తమ రచయిత కె కె ఎల్ స్వామి(కొత్త పరిమళం), ఉత్తమ హాస్య నటుడు గుడాల హరిబాబు(అనూహ్యం), ఉత్తమ ప్రతినాయకుడు ఎం.వెంకట రాజు (కొత్త పరిమళం), లకు అవార్డులు లభించాయి. కాగా రంగ స్థల అలంకరణ, ఉత్తమ మేకప్,తదితర 13 జ్యూరీ అవార్డులను కళాకారులు కి బహూకరించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా లండ రుద్రమూర్తి(బిలాయి), మానాపురం సత్యనా రాయణ(పాలకొల్లు), శిష్ట (హైదరాబాద్), అన్నమనేని ప్రసాద్(ఒంగోలు) వ్యవహరించారు. న్యాయనిర్ణేతలు అవార్డులు ఫలితాలు వెల్లడించారు. సీనియర్ కళాకారులైన ఎస్ ఆర్.ఖాన్,కళ్యాణం పాపారావు, సయ్యద్ గఫార్,ప్రసాద్ లకు అసోసియేషన్ తరపున ఘనంగా సన్మానించారు. విశిష్ట సేవలు అందించిన వాకాడ గోపి, ముదునూరు జగన్నాదరాజు,కేకే ఎల్ స్వామి,తదితరులకు అసోసియేషన్ తరపున దుస్సాలువతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో సినీ కళాకారులు ఆర్ నారాయణ మూర్తి, నరసింహ రాజు,కవిత,జయలలిత తదితరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ కళాకారులు, కళాభిమానులు, రాజకీయ ప్రముఖులు అయిన కిమిడి కళా వెంకట రావు, కలిశెట్టి అప్పలనాయుడు, కిమిడి నాగార్జున, కుచ్చర్లపాటి త్రిమూర్తులు రాజు, వలిరెడ్డి శ్రీనివాసుల నాయుడు, మీసాల విశ్వేశ్వర రావు, ఎం ఎస్ ఎస్ శర్మ, డి ఎల్ ఎన్ రాజు, అప్ప లరాజు, మజ్జి నాగేశ్వరరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.అసోసియేషన్ తరపున వాకాడ గోపి, ఉప్పు శ్రీను,రవిరాజు,కంబాల శివ,అల్లం కనకేశ్వరరావు, ఆలమూరు సత్య శ్రీనివాస్,వాకాడ శ్రీను, గొట్టిముక్కల అప్పల నరసింహ రాజు,ఎం.జగన్నాధ రాజు,పి.కుమార్, శివుకు కాంతారావు, కింతాడ రవి విజయ ప్రసాద్,మేధరమెట్ల వెంకటేశ్వర రావు,బమ్మిడి కార్తిక్ ,టి వి రమణ,నానాలు,తదితరులు పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వాహణ పట్ల నిర్వాహకులకు పలువురు అభినందించారు. భవిష్యత్తు లో కూడా నాటిక పోటీలు నిర్వహించాలని పలువురు కళాభిమానులు కోరారు.

## విద్యార్థుల విజ్ఞాన వికాసానికి సమ్మర్ క్యాంపు తోడ్పాటు



**చీపురుపల్లి మే,13 మేజర్ న్యూస్:** విద్యార్థుల విజ్ఞాన వికాసానికి వేసవి సెలవులో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలు ఎంతో తోడ్పాటు నందిస్తున్నాయని విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు కళ్యాణం పాపారావు, గరివిడి శాఖా గ్రంధాలయ అధికారి ఉషారాణి అన్నారు. వేసవి ప్రత్యేక శిబిరం లో భాగంగా గరివిడి శాఖా గ్రంధాలయం లో మంగళవారం మండలం లో గల వివిధ పాఠశాలల విద్యార్థుల కు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలగా నిలిచిన విద్యార్థుల కు ఈ సందర్భంగా పాపారావు, ఉషారాణి లు అభినందించారు.జూన్ 6 న విద్యార్థుల కు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు వారు తెలిపారు. అదే రోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉషారాణి చెప్పారు.

## హేండ్లూమ్& టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

**సీతానగరం, మే,13 మేజర్ న్యూస్:** తిరుపతి జిల్లా వెంకటగిరిలో గల శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ నందు 3సం.ల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమ కోర్సులో ప్రవేశం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓఎస్డి ఎస్.గిరిధర రావు తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నందు 53 సీట్లకు, తమిళనాడులోని సేలం నందు 12 సీట్లకు, కర్ణాటకలోని గడగ్ నందు 4 సీట్లకు దరఖాస్తులను కోరుతున్నట్లు చెప్పారు. 10వ తరగతి లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై, జూలై 1వ తేది నాటికి బి.సి. మరియు జనరల్ కేటగిరీలకు 15 – 23 సం.ల మధ్య, ఎస్సీ, ఎస్టీ కులాల వారికి 25 సం.ల వయసు గలవారు అర్హులని తెలిపారు. మూడేళ్ల డి.హెచ్.టి.టి కోర్సు నందు ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఇంటర్మీడియట్ ఒకేషనల్ (టెక్స్ టైల్స్), ఐటిఐ (2 సం.లు) కోర్సులందు ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా రెండవ సం.రం నందు ప్రవేశాల కొరకై దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలు మరియు దరఖాస్తు పొందుట కొరకు www.iihtvgr.com వెబ్సైట్ ను, 08625-295003, 93999 36872, 98661 69908, 90102 43054 నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## రక్త నిల్వలు పెంచాల్సిన అవశ్యకత ఉంది: కలెక్టర్



**పార్వతీపురం, మే 13 మేజర్ న్యూస్:** రక్త హీనత నివారణకు, ప్రాణాపాయ సమయాల్లో రక్తాన్ని అందించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా ఆసుపత్రిని మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలకు ఇబ్బంది కలగకుండా సాధారణ పౌరునిగా వెళ్లి ఆసుపత్రిలో అందుతున్న సేవలను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రికి జిల్లా కలెక్టర్ వచ్చారని తెలియడంతో వైద్య సిబ్బంది, రోగులు అవాక్కయ్యారు. ఆసుపత్రిలోని జనరల్ వార్డ్, బ్లడ్ బ్యాంక్ (రక్త నిధి), సదరం, కంటి తనిఖీ కేంద్రం, స్త్రీ ప్రసూతి విభాగం, దంత వైద్య విభాగం, ఓ పి తో పాటు ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అత్యవసర కేసుల వివరాలు, ఎక్కవగా ఏ కేసులు వస్తున్నవి అనే వివరాలను వైద్యులను ప్రశ్నించారు. అనీమియా కేసులు, అత్యవసర కేసులు వస్తున్నట్లు వైద్యులు తెలపగా రక్త దాన శిబిరాలు నిర్వహించి రక్త నిల్వలు పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రక్త నిల్వల (రక్త నిధి) పరికరాలను పరిశీలించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలో కల్పించిన వసతులు వినియోగంలో ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోగులకు అందిస్తున్న భోజన వంటకాలను పరిశీలించారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆసుపత్రి వాతావరణం ఉండాలని లేనిపక్షంలో సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగ శివ జ్యోతి, ఆసుపత్రి వైద్యులు బి వాగ్దేవి, ఏ పి ఎం ఐ డి సి ఇంజనీరింగ్ అధికారి బి.ప్రసన్న కుమార్, వివిధ విభాగాల వైద్యులు డా, సీతారామ రాజు, డా,శ్రీధర్, డా,వెంకట రమణ , డా,దినేష్ కుమార్, డా,కమల కుమారి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 23వ వార్డులో జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఆకస్మిక పర్యటన





**విశాఖపట్నం, మే 13, మేజర్ న్యూస్:** విశాఖ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మరియు జివిఎంసి ఇంచార్జ్ కమిషనర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ 3వ జోన్ 23వ వార్డు పరిధిలోని కె.ఆర్.ఎం కాలనీ తదితర ప్రాంతాలలో అకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ నగరంలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు పరిశుభ్ర పరిచేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు. కె.ఆర్.ఎం కాలనీలో గల యార్డును పరిశీలించి వ్యర్థాలు ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్ కి తరలించాలని ఆదేశించారు. కె.ఆర్.ఎం కాలనీలో తదితర ప్రాంతాలలో డోర్ టు డోర్ వ్యర్థాల సేకరణ, తరలింపు ప్రక్రియను పరిశీలించి నిత్యం పారిశుధ్య నిర్వహణ పనులపై ప్రత్యేక శ్రద్ధను చేపట్టాలని, కాలువలను, గెడ్డలను పరిశీలించి రానున్న వర్షాకాలం దృష్ట్యా అన్ని వార్డులలో గల గెడ్డలలో పూడికలు, వ్యర్థాలు తొలగించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్ కు కమీషనరు ఆదేశించారు. ఈ పర్యటనలో 3వ జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఎ.ఎమ్.ఒ.హెచ్ బి.ప్రసాదరావు, శానిటరీ సూపర్వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్స్పెక్టరు సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

## మూడవ శనివారం స్వర్ణ ఆంధ్రా -స్వచ్ఛ ఆంధ్ర

**పార్వతీపురం , మే 13 మేజర్ న్యూస్:** వచ్చే మూడవ శనివారం స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి వడగాలుల దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే మూడవ శనివారం స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా "బీట్ ద హీట్" థీమ్ తో వేసవి దృష్ట్యా వడ గాల్పులు, బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజలందరికీ వివరించాలన్నారు. వడ గాల్పుల వలన ఏ ఒక్కరూ అనారోగ్యం బారిన పడకూడదని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి హామీ శ్రామికులు, గ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులు తదితరులతో సమావేశం నిర్వహించి వారికి వేసవి దృష్ట్యా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు వివరించాలన్నారు. వారు చేయవలసిన పనులు చేయకూడని పనులు ఏమిటో స్పష్టంగా తెలియజేయాలన్నారు. పిల్లలు, వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ ముఖ్యమైన ప్రదేశాలలో చలివేంద్రాలను నిరంతరం నడపాలన్నారు. వాతావరణ హెచ్చరికలు పట్ల అప్రమత్తంగా ఉండాలి వాతావరణ హెచ్చరికలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిందని, రెవెన్యూ, సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన ఆదేశించారు. వేసవి తీవ్రత, అకాల వర్షాలు, ఈదురు గాలుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు.

# రజనిపై పోలీసుల ప్రవర్తన అమానుషం



**బొబ్బిలి, మే 13: మేజర్ న్యూస్:** రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఇందుకు నిదర్శనం వైఎస్సార్ సీపీ నాయకులు పై అక్రమంగా పోలీసులు కేసు నమోదు చేయడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే శంభంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు.ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీ మహిళా మంత్రి విడుదల రజని పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషం, అవమానకరంగా ఉందని తెలిపారు. పోలీసులు చట్టానికి వ్యతిరేకంగా పనిచేయడం జరుగుతుందని అందుకు ఉదాహరణ మాజీ మహిళా మంత్రి విడుదల రజని పై దురుసుగా ప్రవర్తించారని అన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని పోలీసులు గుర్తించాలని సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు అన్ని ప్రజలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఈమేరకు పోలీసులు తీరు చాలా దారుణంగా ఉందని అన్నారు.రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం నకు ప్రజలు గుణపాఠం చెబుతారని శంభంగి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి నాయకులు తమ్మిరెడ్డి దామోదర్, బొద్దల సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# బయోమెట్రిక్ పరికరాలను వైద్య సిబ్బందికి అందజేసిన డీఎంహెచ్‌వో భాస్కరరావు



**పార్వతీపురం, మే 13, మేజర్ న్యూస్:** సకాలంలో ఆరోగ్య సర్వే లక్ష్యాలు చేరుకోవడంలో బయోమెట్రిక్ పరికరాలను సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు.వైద్యారోగ్యశాఖ జిల్లాకు పంపిణీ చేసిన బయోమెట్రిక్ పరికరాలను మంగళవారం ఆరోగ్య కార్యాలయంలో డిఎం%ఏ%హెచ్ఓ వైద్య సిబ్బందికి అందజేశారు. డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య సిబ్బంది పలు సర్వేలు చేపట్టడం జరుగుచున్నదనీ,ఇందుకు గాను జిల్లాకు 695 బయోమెట్రిక్ పరికరాలను పంపిణీ చేశారని వాటిని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బందికి అందజేస్తున్నామన్నారు. ఇంటింటి సర్వేలో మరియు ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య తనిఖీలు చేపట్టి వివరాలు ఆన్లైన్ నమోదు చేయాల్సి ఉందని ముఖ్యంగా ఎన్సీడీ సర్వే,ఆర్బిఎస్కె సర్వే, ఇహెచ్ఆర్ నమోదు,ఇందుకు ఓటిపి విధానంలో సిబ్బందికి ఎక్కువ సమయం పడుతుందని,అంతేగాక కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ సమస్య,కొంతమందికి ఫోన్లు లేకపోవడం వల్ల వారి ఆరోగ్య వివరాలు నమోదు కొంత క్లిష్టతరంగా ఉండేదని అన్నారు.ఇప్పుడు అందజేసిన బయోమెట్రిక్ పరికరాలతో వేలి ముద్ర సేకరణ ద్వారా సర్వే మరింత సులభమవుతుందని,సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయడానికి దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు,డా పిఎల్.రఘుకుమార్,సిడిఎస్ ఫార్మసిస్ట్ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పాదాలు తెచ్చే క్రమంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు





**గుమ్మలక్ష్మీపురం, మే 13 మేజర్ న్యూస్:** శ్రీశ్రీశ్రీ గుమ్మలక్ష్మీపురం వ్యాపారమ్మ తల్లి పండగల సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన మొదటి ఘట్టం తల్లి పాదాలు తెచ్చే కార్యక్రమంలో ప్రజలందరూ ఐకమత్యంతో చేయి చేయి కలిపి సహకారం అందించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని గ్రామ సర్పంచ్, ఉత్సవ కమిటీ సభ్యులు బోత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. ఇదే ఐక్యత ఇదే ఇదే సంయమనం, ఇదే సహకారం అందిస్తూ మిగతా కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ప్రతి ఒక్కరికి చేతులెత్తి నమస్కరిస్తునామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు వివిధ కమిటీల సభ్యులు, మహిళా సభ్యులు, సహకరించిన తీరు అపూర్వమనీ, అద్వితీయం, అనిర్వచనీయం అన్నారు. ఈ మేరకు సోమవారం నుంచి అన్ని కమిటీలు, మహిళా కమిటీల సభ్యులు పూర్తి సహకారాన్ని అందిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో గ్రామాల్లో ఉంటున్న మన గ్రామ ప్రజానీకానికి అందరికీ గ్రామం తరపున స్వాగతం పలుకుతున్నమన్నాడు. ఈ బృహత్తర కార్యక్రమ నిర్వహణలో ఎక్కడైనా చిన్న లోపాలు ఉంటే అవి కమిటీ దృష్టికి తీసుకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని, ప్రజల రద్దీ పెరుగుతున్న కారణంగా మెయిన్ రోడ్ లో ఎక్కడ కూడా కార్లు నిలుపరాదని ప్రజలు, వాహనదారులు గ్రహించాలని అన్నారు. పండగల చివరి నాలుగు రోజులు కారు పార్కింగ్ కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న సంత ప్రాంతం, అలాగే కొండవీధి క్రికెట్ గ్రౌండ్ ఇంకా మరికొన్ని ప్రాంతాలు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే రేపటి నుంచి ఘటాలు తిరిగే ప్రాంతాల మ్యాప్ ని కమిటీ సభ్యులు తయారు చేయటం జరిగిందని, అది మహిళా ప్రతినిధులు ఆయా కాలనీలో పూర్తి సహకారం అందించి ఘటాల పర్యటన విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అదేవిధంగా మంగళవారం నుంచి అన్ని కమిటీలు వారి యొక్క బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించేలా సహకరించాల్సిందిగా కోరుతున్నామన్నారు. అలాగే మంగళవారం ఘటాలు సిద్ధం చేసే కార్యక్రమం ఉంటుంది కావున దానికి ఆ కమిటీ మరియు మహిళలు సహకరించాల్సిందిగా కోరుతున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొని పూర్తి సహకారాన్ని అందించి ఈ ఉత్సవాలను జయప్రదం చేస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఉన్నామన్నారు.

## జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులను పర్యవేక్షించిన పీఓ



**పార్వతీపురం, మే 13 మేజర్ న్యూస్ :** పార్వతీపురం పట్టణ పరిధిలోని మార్కెట్ యార్డ్ యందు నిర్మించబోతున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, మార్గదర్శకాలతో దిశా నిర్దేశం చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్శనలో గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మణిరాజ్, ఏపీఓ మురళీధర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన చికిత్స



**పాలకొండ, మే 13, మేజర్ న్యూస్:** పాలకొండ శ్రీ విజయ మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి లో నెలలు నిండకుండా పుట్టిన 900 గ్రాముల ప్రీ మెచూర్ బేబీకి విజయవంతంగా డెలివరీ చేసి శిశువు కు ప్రాణం పోసారు. రేగిడి ఆమదాలవలస మండలానికి చెందిన లక్ష్మి అనే 7వ నెల గర్భిణీ.. వేరే హాస్పిటల్ లో చెకప్ అనంతరం కడుపులోని బేబీని అబార్షన్ చెయ్యాలని లేదంటే తల్లికి, బిడ్డకి ప్రాణాపాయం అని చెప్పడంతో విజయ హాస్పిటల్ వారిని సంప్రదించి అడ్మిట్ అయ్యారు. అయితే తల్లి బిడ్డలను పరీక్షించి ఆపరేషన్ చెయ్యడం ద్వారా బిడ్డను తల్లిని కూడా కాపాడొచ్చని గైనికాలజిస్ట్ చరిష్మా తెలపడంతో అత్యంత అరుదైన ప్రిమెచూర్ బేబీకి జన్మనివ్వడం జరిగింది. పిడియాట్రిక్ డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో పుట్టిన బిడ్డకు ఎటువంటి హానీ జరగకుండా జాగ్రత్తగా కాపాడి నేడు డిశ్చార్జ్ చేసినట్టు హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. సాధారణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో విజయ ఆసుపత్రి నెలకొల్పామని అందులో భాగంగా ఖర్చుతో కూడుకున్న వైద్యసేవలకు నోచుకొని ఎంతోమందికి ఆరోగ్యశ్రీద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నామని హాస్పిటల్ ఎండి దూబ పద్మావతి తెలిపారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో
# కిషోరి వికాసం సమ్మర్ క్యాంప్



**గరుగుబిల్లి,మే 13,మేజర్ న్యూస్:** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న కిశోరి వికాసం కార్యక్రమం లో భాగముగా వచ్చే నెల 10వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వ హించడం జరుగుతుందని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి అన్నారు.కిషోరి వికాసం సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో బాలల హక్కులు, రక్షణ,తదితర అంశాలపై కిషోరి బాలికలకు తెలియ జేశారు.అనంతరం జరిగిన సమా వేశంలో మాట్లాడుతూ సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ వచ్చేనెల 10వ తేదీ వరకు కిషోరి వికాసం కార్య క్రమంలో కిషోరి బాలికలకు పలు అంశాల గురించి తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.అదే విధంగా 11 సంవత్సరాల నుంచి 18 సంవత్స రాలు బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబ నను మెరుగు పరచడమే ఈకార్య క్రమము యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. కిషోరి వికాసం కార్య క్రమం బాలికల బంగారు భవిష్య త్తుకు పునాది వేస్తుందని,అదే విధంగా ఉజ్వల ఆరోగ్యకరమైన సాధికార దిశగా వేసే అడుగులకు చేయూతను ఇద్దామని పేర్కొన్నారు. రక్తహీనత నివారణే ధ్యేయంగా గర్భిణీలు బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారమును పంపిణీ చేయడం జరుగుతుంద న్నారు.ఈకార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బిడ్డిక చిన్నమ్మి చింతాడ ఉదయకుమారి, మహిళా సంరక్షణ అధికారి గొర్లి భవాని, అంగన్వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి, మహంతి పద్మావతి పాల్గొన్నారు.

## ఆర్చరీ క్రీడాకారులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన కలెక్టర్



**సీతానగరం/పార్వతీపురం, మే 13, మేజర్ న్యూస్:**పార్వతిపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ విద్యార్థులకు విలువిద్య ఏకరూప క్రీడ దుస్తులను మంగళవారం నాడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో క్రీడా శిక్షణ శిబిరాలు శారీరక మానసిక ఉల్లాసానికి ఎంతో ద్రోహత పడతాయని విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమకు ఇష్టమైన క్రీడల్లో సత్తా చాటీ ఉన్నత శిఖరాలను అధిరోహించి మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు శిక్షకులు గాంధీ . సంగమేశ్ వున్నరు

## ఇసుక సరఫరాకు రీచులు సిద్ధం: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పార్వతీపురం, మే 13 మేజర్ న్యూస్ :** జిల్లాలోని భామిని మండలం నేరడి, పాలకొండ మండలం చినమంగళాపురం ఇసుక రీచుల నుంచి ఇసుక సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాకు సంబంధించి కలెక్టర్ సంబంధిత అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక సరఫరా కావాలని కలెక్టర్ స్పష్టం చేసారు. ఇసుకను తరలించేందుకు వీలుగా స్టాక్ పాయింట్లు సిద్ధంగా ఉండాలని, అక్రమ రవాణాకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని, గట్టి పోలీసు బందోబస్తు, బారికేడ్లు, చెక్ పోస్టు, ఆన్ లైన్ వే బిల్లు, రిజిష్టర్లు, రికార్డులు అన్నీ పక్కాగా ఉండాలని అన్నారు. మొత్తం ప్రక్రియను పూర్తిచేసి ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించగా, అన్నీ సిద్ధమైనట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా గనులు, భూగర్భవనరుల శాఖాధికారి జి. జయప్రసాద్, పోలీస్, భామిని, పాలకొండ తహాశీల్దారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# పర్యాటకాభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి
## జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



**పార్వతీపురం, మే13, మేజర్ న్యూస్:** జిల్లాలోని తోటపల్లి, ఏనుగుకొండ, పెద్దగెడ్డ, వీరఘట్టం, కూర్మసాగరం ప్రాంతాలు బోటింగ్ కు అనుకూలమని, కావున దానిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఆయన ఛాంబరులో అటవీ మరియు పర్యాటక శాఖ కార్యకలాపాలపై సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ప్రాంతాల్లో స్పీడ్ బోటింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఒక్కో ప్రాంతంలో ఆరు నుంచి పది మంది ఆసక్తి కలిగిన గిరిజన యువతకు స్పీడ్ బోటింగ్ పై శిక్షణ ఇప్పిస్తామని, కావున వారిని ఎంపికచేయాలని అన్నారు. బోటింగ్ నిర్వహణ ప్రైవేట్ సంస్థలు లేదా ఇతరులు నిర్వహించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. బోటింగ్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, మార్గ నిర్దేశాలు తదితర పనుల బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన బోట్లను వినియోగించాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీతంపేట మండలం పనుకుపేటలో గిరి గ్రామదర్శిని పనులు వీలైనంత త్వరగా ప్రారంభం కావాలని అన్నారు. గ్రామదర్శినిలో గిరిజన సంస్కృతి ప్రతిబింభించేలా మట్టితో నిర్మించిన గృహాలు ఉండాలని, ఉత్తమ గృహానికి బహుమతిని ప్రకటిస్తామని తెలిపారు. గిరి గ్రామదర్శినిలోకి వెళ్లేందుకు ఆకర్షనీయమైన ప్రవేశ ద్వారం, గిరిజనులు వినియోగించే సామాగ్రి, వస్తువులతో ఆర్ట్ గ్యాలరీ ఉండాలని అన్నారు. థింసా నృత్యం, విక్రయ దుఖాణాలు, కళ్యాణమండపం వంటి ఏర్పాట్లు అందులో ఉండాలని, వచ్చే నెలలోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అడలి వ్యూ పాయింట్ వద్ద వసతి గృహ నిర్మాణ పనులు ఆగస్టు నాటికి పూర్తికావాలని తేల్చిచెప్పారు. ప్రకృతి సోయగాలకు, పర్యావరణానికి అనుకూలమైన జగతిపల్లి రీసార్ట్స్ ప్రాంతాన్ని ప్రత్యామ్నాయ మార్గం ద్వారా అభివృద్ధి చేసేందుకు ఆలోచన చేయాలని సూచించారు.సీతంపేటలో మ్యూజియం, షికమరు వాటర్ ఫాల్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా అటవీ శాఖాధికారి సహకారంతో ఈ పనులన్ని నిర్దేశిత సమయంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణ రావు, జిల్లా అటవీ శాఖాధికారి జి.ఏ.పి. ప్రసూన, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్.రాజా రావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

**గరుగుబిల్లి, మే13, మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగముగా మంగళ వారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు.ఈ మేరకు రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఎ కృష్ణమోహన్ ఉత్తర్వులు మేరకు, ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మీ ఆదేశాలు మేరకు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరమును నిర్వ హించడం జరుగుతోందని శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు.వేసవి శిక్షణ శిబిరంకు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో పాటు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారని పేర్కొ న్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు నుంచి జూన్ ఆరవ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరమును గ్రంథాలయంలో నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్,ఆటల పోటీలు తదితర కార్యక్రమాలను



ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు.ఈమేరకు వేసవి శిక్షణ శిబిరమును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయం నిర్వాహకులు మధు సూదనరావు కోరారు.ఈకార్యక్రమంలో రావివలస,సంతోషపురం గ్రామాలకు చెందిన బీడీసీలు కొయ్యాన ప్రసాదరావు, దత్తి తేజస్వినితోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రీ సర్వే తో రైతులకు మేలు: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



**పార్వతీపురం, మే 13 మేజర్ న్యూస్:** ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే తో భూ సమస్యలు తొలగి రైతులకు, భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. రెండవ విడత రీ సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్ల బురిడీ గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే జరిపే ముందు రైతులకు నోటీసులు జారీ చేసి గ్రామంలో రైతుల భూములతోపాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల భూములు, పోరంబోకు భూములను కొలతలువేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేస్తారన్నారు. తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే భూమి కొలతలు కొలిచి మీ భూమికి హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి రి సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులు దొర్లకుండా పక్కగా నిర్వహించాలన్నారు. రైతులకు నోటీసులు జారీ చేస్తున్నది లేనిది రైతులకు అడిగి ఆరా తీశారు,ఇప్పటివరకు ఎంత మేర సర్వే నిర్వహించినట్లు తాసిల్దార్ వై.జయ లక్ష్మి ను ప్రశ్నించగా 1147 ఎకరాల గ్రౌండ్ ట్రూటింగ్ పూర్తి కాగా మిగతా 31 ఎకరాలు సర్వే నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన భూ యజమానుల వారసులకు మార్పు చేసే విధంగా ఎఫ్ ఎం సి విచారణ పూర్తి చేసి మ్యూటేషన్ లను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలు తలెత్తకూడదనేది రీ సర్వే ఉద్దేశమని, రైతులు పక్కా భూ రిజిస్ట్రేషన్లు చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. రోడ్లుకు కేటాయించిన భూములలో హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలన్నారు. చెరువులు, వాగులలోని ఆక్రమణలు ఉంటే తొలగించాలని సూచించారు. సర్వే ప్రక్రియ జరిగిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే, భూ రికార్డుల నిర్వహణ శాఖ సహాయ సంచాలకులు లక్ష్మణ రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి.రవి తేజ, మండల సర్వేయర్ స్వామి, గ్రామ సర్వేయర్ నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రజల అవగాహనకు మాక్ డ్రిల్: జేసీ శోబిక




**పార్వతీపురం, మే 13 మేజర్ న్యూస్ :** అత్యవసర పరిస్థితుల్లో పౌరుల సురక్షిత, సంసిద్ధతకు మాక్ డ్రిల్ ను బుధవారం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక తెలిపారు. మాక్ డ్రిల్ సన్నాహక చర్యలపై మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో భద్రతా మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మాక్ డ్రిల్ లో భాగంగా వైమానిక దాడులతో సహా ఇతర అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా ప్రతిస్పందించాలో తెలపడంతోపాటు స్వీయరక్షణపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన పెంపొందించాలని ఆమె సూచించారు. ముఖ్యంగా యుద్ధ సమయాల్లో సంక్షోభం తలెత్తినపుడు ప్రజలకు ప్రాణనష్టం కలుగకుండా ప్రతీ కుటుంబం ప్రభుత్వం తెలిపిన సురక్షితమైన జాగ్రత్తలు పాటించడం ద్వారా సంక్షోభం నుండి సురక్షితంగా ఉండవచ్చని అన్నారు. మాక్ డ్రిల్ లో పోలీసుల, ఫైర్ సర్వీసెస్, జిల్లా అధికార యంత్రాంగంతో పాటు, ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. భద్రతా మాక్ డ్రిల్ కు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఫైర్ సర్వీసెస్, రెవిన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ కమీషనరు, ఎన్ సిసి కో-ఆర్డినేటర్, రైల్వే, ఎపిఇపిడిసిఎల్, ఆర్ టిసి, తదితర శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు సంభవిస్తే సురక్షిత తాగు నీటి సరఫరా, ఆహార పదార్థాలు, ముడి సరుకు సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, సురక్షిత ప్రాంతాలకు తరలింపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు సవివరమైన సమగ్ర ప్రణాళికలు కలిగి ఉండాలని ఆమె ఆదేశించారు. మాక్ డ్రిల్ నిర్వహించే సమయంలో సైరన్ మోగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మాక్ డ్రిల్ పట్ల ప్రజలకు ముందుగా తెలియజేసి భయభ్రాంతులకు లోనుకాకుండా చేయాలని ఆమె స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ముఖ్య అగ్నిమాపక అధికారి కె శ్రీనుబాబు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యంగా అణుబాంబు వంటి దాడి సమయంలో పౌరులు తీసుకోవలసిన సురక్షిత చర్యలు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అణుబాంబు విస్ఫోటన జరిగితే మూడు నుండి 5 కిలో మీటర్ల మేర తీవ్ర ప్రభావం ఉంటుందని చెప్పారు. అటువంటి సమయంలో దట్టమైన గోడలు గల ఇళ్లలో ఉండటం వలన రేడియేషన్ ఉండకుండా సురక్షితంగా ఉండుటకు అవకాశం ఉందని వివరించారు. భూగర్భ నీటిపారుదల వ్యవస్థలు (అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ) వంటి వాటిని సైతం ఉపయోగించుకుని సురక్షితంగా ఉండవచ్చని తెలిపారు. యుద్ధం వంటి సమయాల్లో రాత్రి పూట ఎక్కడా వెలుతురు లేకుండా చీకటి (బ్లాక్ ఔట్) చేయాలని, ఇన్వర్టర్ లు వినియోగించే వారు కూడా లైట్లు ఆపివేయాలని అన్నారు. ఆసుపత్రులు వంటి అత్యవసర వైద్య సేవలు గల సంస్థలు విద్యుత్ కాంతుల బయటకు రాకుండా తగిన కర్టెన్ లను వేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం సైరన్ మోగితే పరిస్థితిలో తీవ్రత ఉందని గ్రహించాలని, అందుకు తగిన విధంగా సురక్షిత చర్యలు తీసుకోవడం, అధికార యంత్రాంగంతో సహకరించడం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె హేమలత, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి ధర్మచంద్రా రెడ్డి, ఈపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీర్ కోడా చలపతిరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డా టి జగన్మోహన రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఐ రాజేశ్వరి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం శశి కుమార్, డి ఎస్ పి థామస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీకి దైవ బలం మెండుగా ఉండాలని పూజలు



**గరుగుబిల్లి, మే13, మేజర్ న్యూస్:** ఆపరేషన్ సింధూర్ లో భాగముగా సైనికులకు,భారతీయులకు,మన భారతదేశాన్ని సురక్షితంగా ఉంచడం కోసం శ్రమిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకి దైవ బలం మెండుగా ఉండాలని కోరుతూ జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జనసేన పార్టీ నాయ కులు ప్రత్యేక పూజలు నిర్వహించా రు.ఈమేరకు కురుపాం నియోజక వర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కద్రక మల్లేశ్వర రావు ఆధ్వర్యంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు బోను శివ, కురు పాం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గార గౌరీశంక ర్రావు, కొమరాడ మండల జనసేన పార్టీ అధ్యక్షులు తెంటు శ్రీకర్, తది తరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసంద ర్భంగా శ్రీవెంకటేశ్వర స్వామి యొక్క దివ్య ఆశీస్సులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ,భారత త్రివిదదల సైనికుల మీద, భారత యావన్మంది ప్రజల మీద,దైవబలం చేకూరాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి విజయ నగరం కార్యనిర్వహణ కార్యదర్శి వాన ఉపేంద్ర,నియోజకవర్గం నాయ కులు అధికారి అనిల్, తాడేళ్ళ శ్రీరామ్, భోగి తారక్, జనసేన నాయ కులు,కార్యకర్తలు అప్పలనాయుడు, గంగునాయుడు, బర్ల పండు,జన సైనికులు, తదితరులు పాల్గొన్నారు

## జనసైనికుని భార్యకు రూ.10వేల ఆర్థిక సాయం



**విశాఖపట్నం, మే 13, మేజర్ న్యూస్:** మానవత్వానికి నిజమైన నిదర్శనం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్. వైయస్సార్సీపినీ అనుసరిస్తూ చేస్తున్న ఆయన సేవలో కులం మతం పార్టీలో చూడకుండా పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తూ చేయూతనందిస్తున్నారు. 34 వ వార్డు భూపేష్ నగర్ వాసి పెళ్లి జరిగి ఆరు నెలలకే ఫ్లెక్సీ కడుతూ పడిపోయి చనిపోయిన జన సైనికుడు కడితిరాజు (26) ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆయన భార్యకు వాసుపల్లి గణేష్ కుమార్ సొంత నిధులతో రూ.10,000/- ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడు కడితి రాజు తల్లి వెంకటలక్ష్మి కి ఉన్న ఇద్దరు కుమారులు చనిపోయారు. భార్య కడితి లావణ్య చిన్న వయసులోనే విడో కావడం వాసుపల్లి మానవత్వాన్ని కలిచివేసింది. తక్షణమే స్పందించి ఆర్థిక సాయంతో పాటు కుటుంబానికి అండగా నిలబడతానని భరోసా కల్పించారు. ఏ సహాయం కావాలన్నా తన వద్దకు రావాలని, లావణ్యకు ఉద్యోగం అవకాశం కల్పిస్తానని ధైర్యం నింపారు. వాసుపల్లి ఓదార్పుతో కన్నీటి పర్యంతమైన భార్య లావణ్య తల్లి వెంకటలక్ష్మి.. వాసుపల్లికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సౌత్ మున్సిపల్ విభాగం అధ్యక్షురాలు మరియు 34 వార్డ్ కార్పొరేటర్ తోట పద్మావతి, 29వ వార్డ్ అధ్యక్షులు పీతల వాసు, 30వ వార్డ్ అధ్యక్షులు దశమంతల మాణిక్యాలరావు, 33వ వార్డ్ అధ్యక్షులు ముత్తబత్తుల రమేష్, 35వ వార్డ్ అధ్యక్షులు ఆలూపన కనకా రెడ్డి, సౌత్ బూత్ కమిటీ మరియు 39 వ వార్డు అధ్యక్షులు ముజీబ్ ఖాన్, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణ, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు లింగం శీను, సౌత్ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులు సువార్త రాజు( సుబ్రహ్మణ్యం), సౌత్ సంస్కృతం అధ్యక్షులు సూర్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో
## ఓరియెంటేషన్‌లో భాగంగ విజ్ఞాన వేసవిశిబిరాలకు హాజరైన విద్యార్థులకు రిసోర్స్



**అచ్చుతాపురం, మే 13, మేజర్‌న్యూస్:** పర్సన్ గా అచ్యుత స్కూల్ హిందీ టీచర్ విజయ మేడమ్ పిల్లలకు మెడిటేషన్ క్లాసులు చెప్పడం జరిగింది అనంతరం ఆ మెడిటేషన్ యొక్క కొన్ని వివరణలు పిల్లలకు వివరించారు మనం ఎంత జ్ఞానంతో చేస్తాము అంత విజ్ఞానాన్ని పెంపొందించగలుగుతామనిఆమె వివరించారు ఈ మెడిటేషన్ చేయటంలో మనలో ఉన్న బోన్స్ బ్రెయిన్ మరియు మన శరీరంలో ఉన్న అవయవారాన్ని కూడా దృఢపడతాయని కూడా ఆమె వివరించారు వచ్చిన విద్యార్థులకు స్థానిక లైబ్రేరియన్ మాట్లాడుతూ ప్రతిరోజు కూడా ఈ విజ్ఞాన శిబిరాల శిబిరాలకు అచ్యుతాపురంమండల లో గల అన్ని స్కూల్ యాజమాన్యులకు అందరికీ కూడా మెసేజ్ పెట్టడం జరిగింది ఇంకా చాలామంది స్కూల్ పిల్లలు రావడం లేదు వాళ్లు కూడా రావాలని ఆయన వివరించారు అనంతరం వచ్చిన పిల్లలకు స్వీట్ పంపని చేశారు.

## అసంఘటితరంగ కార్మికులందరూ ఈ శ్రమ కార్డులు తీసుకోవాలి



**అచ్చుతాపురం, మే 13, మేజర్‌న్యూస్:** అసంఘటితరంగ కార్మికులకు ఉచిత గుర్తింపు కార్డులు జారీ కార్యక్రమం లో భాగంగా ఈరోజు జగన్నాపురం, ఎర్రవరం గ్రామంలో సుంకర. వెంకటేశ్వరరావు లేబర్ ఆఫీసర్ ఎలమంచిలి వారు పర్యటించి 16 సంవత్సరాల నుండి 59 సంవత్సరాలు లోపు వయసు కలిగిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని రంగాలు వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, భవన నిర్మాణ కార్మికులు, చేతు రుత్తులు, స్వయం ఉపాధి , సేవా రంగం, హమాలీ, రవాణా రంగం దుకాణాలులో పనిచేసే కార్మికులు నమోదు చేసుకుంటే ప్రమాద మరణముకు 2 లక్షల రూపాయలు, అంగవైకల్యం కు గురైన వారికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందిస్తారని, దీనికి ఆధార్ కార్డు నకలు, బ్యాంక్ అకౌంట్ నెంబరు , సెల్ నెంబరు వంటి వివరాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము కవులు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాంద్రేగుల. రామ సదాశివ రావు, ఉపాధి కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

## నేడు మునగపాకలో జనవాణి కార్యక్రమం



**మునగపాక, మే 14, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక జనసేన పార్టీ కార్యాలయం మరియు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు 14వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ప్రజలకు అందుబాటులో ఉంటారని మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం తెలిపారు, మండలంలో అన్ని గ్రామాల పరిష్కారం కాని సమస్యలను ఒక దరఖాస్తు పై వ్రాసుకుని, వారి యొక్క ఆధార్ కార్డు, సమస్యను క్లుప్తంగా రాసుకుని జనవాని కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కు తెలియజేసుకోవచ్చని పరశురాం తెలిపారు, మండలంలో గల అన్ని ప్రభుత్వ శాఖ అధికారులు హాజరవుతారని తెలిపారు, ఈ యొక్క జనవాని కార్యక్రమాన్ని మండలంలో గల అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## తల్లి జ్ఞాపకార్థం మహిళా కూలీలకు పండ్లు పంపిణీ
### – సర్పంచ్ దిమ్మల అప్పారావు



**మునగపాక, మే 14 , మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక సర్పంచు దిమ్మల అప్పారావు తల్లి కీర్తిశేషులు దిమ్మల అచ్చియ్యమ్మ 16వ వర్ధంతి సందర్భంగా ఉపాధి హామీ పథకంలో పనిచేసే మహిళా కూలీలందరికీ సోమవారం పండ్లు, డ్రింకులు పంపిణీ చేశారు, సర్పంచ్ అప్పారావ్ మాట్లాడుతూ మనం సంపాదించే సంపాదనలో కొంత సొమ్ము మన పెద్దల పేరున సేవా కార్యక్రమం చేయడం వలన మనకు సంతృప్తినిస్తుందని అన్నారు, ఈ కార్యక్రమంలో దిమ్మల నూకరాజు, దిమ్మల శివ, వినోద్, మహేష్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతులకు సన్మానం
### – కొండకర్ల గ్రామంలో సమావేశం



**అచ్చుతాపురం, మే 13, మేజర్‌న్యూస్:** అచ్చుతాపురం మండలం కొండకర్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతులకు సన్మానం కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయ అధికారి శంఖర్ గోవింద్ , గ్రామ పెద్దలు, గ్రామ సంఘం సభ్యులు, మరియు ఉత్తమ రైతులు హాజరుకావడం జరిగింది.ఈ సమావేశంలో ఉత్తమ రైతు భాను ప్రకాష్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూసారం పెరిగి, ఆరోగ్యం మెరుగుపడతుందని, ఖర్చులు తగ్గిపోతాయని, పర్యావరణాన్ని కాపాడే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, రైతులు ఈ వేసవిలో పి ఎం డి ఎస్ పద్ధతిని అనుసరించాలని, నవధాన్యాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతులకు సన్మానం చేయబడింది. ప్రకృతి వ్యవసాయం చేస్తూ తమ అనుభవాలను ఇతర రైతులకు పంచుకోవాలని వారికి సూచించబడింది.గ్రామంలో మండల వ్యవసాయ అధికారి, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఆరు మంది రైతులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ), గ్రామ పెద్దలు, గ్రామ ఆరోగ్య అధికారి (వి ఏ ఏ), ఉపాధి హామీ కార్మిక స్కీమ్ ఎన్ ఆర్ జి ఎస్ సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ (ఏ పి సి ఎన్ ఎఫ్) సిబ్బంది పాల్గొన్నారు.

## మునగపాక మండలంలో అక్రమ గ్రావెల్ దందా
### – దొరికితే దొంగ– దొరక్కపోతే దొర



**మునగపాక, మే 13, మేజర్‌న్యూస్:** టి సరస పల్లి రెవెన్యూ గ్రామంలో రామా రాయుడు పేట గ్రామంలో కొండలను మంగళవారం జెసిబి తో అక్రమంగా తవ్వుతుండగా మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఎస్సై పి ప్రసాద రావు నేతృత్వంలో జెసిబిను పట్టుకొని స్టేషన్ కి తరలించారు, మండలంలో తోటాడ, పాటిపల్లి, టి సరస పల్లి, నరేంద్ర పురం,చెర్లోపాలెం,కొండవాలు ప్రాంతం కావున ప్రభుత్వ కార్యాలయాలు సెలవు దినాలలో రాత్రి పగలు తేడా లేకుండా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి, అక్కడ గల ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, గ్రావెల్ దందా తెలిసిన మీడియా వారికి (సూర్య పత్రిక కాదు) మామూలు(లంచం) మట్టజెప్పి గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి, అటు మైన్స్ అధికారులు కు కూడా అధిక మొత్తంలో మామూలు తీసుకొని పట్టనట్లు వ్యవహరించడం శోచనీయమని ప్రజలు ఆరోపిస్తున్నారు, పెద్ద పెద్ద భారీ వాహనాలతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు పై పరిమితి నుంచి అధిక లోడుతో ఈ రోడ్లపై ప్రయాణించడం వల్ల రోడ్లు పోతున్నాయని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదని వాపోతున్నారు, ప్రభుత్వ ఖజానాకి నష్టం కలిగించే గ్రావెల్ ముఠా ని అరకట్టాలని ప్రజలు వాపోతున్నారు.

## ఉపాధి బకాయిలు చెల్లింపులో ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం
### – పనిచేసిన వారికి డబ్బుల్లేవు , ఉద్యోగులకు జీతాలు రావు
### – కాళీ క్యారేజీలతో ఉపాధి శ్రామికులు వినూత్న నిరసన



**దేవరాపల్లి, మే 13, మేజర్‌న్యూస్:** ఉపాధి హామీ బకాయిలు చెల్లింపులో ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం చేస్తు ఇందులో పని చేస్తున్న ఉద్యోగులకు సైతం జీతాలు చెల్లించలేదని దీని పర్యావసానం తీవ్రంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. వెంకన్న పేర్కొన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తిమిరాం, వెంకటరాజుపురం గ్రామల్లో ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి కాళీ క్యారేజీలు చేతపట్టి వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలు అస్తవ్యస్తంగా మారిందని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల శ్రామికుల కుటుంబాలకు రూ.800 కోట్ల మేర కూలీ డబ్బులు బకాయి లుండటంతో పేదలు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పథకం కింద పని చేసే దాదాపు 15 వేల మంది ఉద్యోగులు, సిబ్బంది మూడు నెలలుగా వేతనాలు అందక విలవిల్లాడిపోతున్నారని తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు దొరకని ప్రస్తుత వేసవి రోజుల్లో ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవించే పేదల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పథకం పనుల్లో పనిచేసే కూలీలకు15 రోజుల లోపే వారి పనికి సంబంధించిన కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని అయితే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 27 లక్షల పేద కుటుంబాలకు సంబంధించిన 39 లక్షల మంది పేదలకు రెండు నెలలుగా చేసిన పనులకు కూలీ డబ్బులు చెల్లించలేదని తెలిపారు. మరోవైపు మెటీరియల్ కేటగిరిలో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, తదితర పనులు చేసిన వారికి రూ.2,500 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని అధికార వర్గాలే పేర్కొన్నాయని తెలిపారు. మరో వైపు ఉపాధి హామీ పథకం కార్యక్రమాల పర్య వేక్షణకు మండల కంప్యూటర్ సెంటర్ల (ఎంసీసీ) లో పని చేసే టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏ) పిల్డ్ అసిస్టెంట్లు మొదలు రాష్ట్ర స్థాయి కార్యాలయంలో పనిచేసే దాదాపు ఏడు వేల మంది వివిధ స్థాయిల ఉద్యోగుల వరకు ఫిబ్రవరి నెల నుండి వేతనం ఇప్పటి వరకు చెల్లించలేదని తెలిపారు. గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకం పనులను నిత్యం పర్యవేక్షించే ఫీల్డు అసిస్టెంట్లకు, రాష్ట్ర స్థాయి గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో పనిచేసే కొన్ని కేటగిరీల ఉద్యోగులు 8 వేల మందికి మార్చి నెల నుంచి వేతనం ఇవ్వలేదన్నారు. మొత్తంగా దాదాపుగా 15 వేల మందికి జీతాలు ఇవ్వక పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మితిమీరిన అధికార పార్టీ నేతల ఆగడాలు గత ఏడాది జూన్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు పనులు కల్పించే ఉపాధి హామీ పథకం అమలులో రాజకీయ జోక్యం మితి మీరిపోతోందని తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్ర బాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే అప్పటిదాకా గ్రామాల్లో ఉపాధి పథకం ఫీల్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిలో అత్యధికులను ఏకపక్షంగా తొలగించి, ఆ స్థానాల్లో కూటమి పార్టీల సానుభూతిపరులను నియమించారని అన్నారు. కోన్ని గ్రామాల్లో పార్టీల వారీగా పనులు కేటాయిస్తున్నారని ఎన్నో ఘటనలు రుజువు చేశాయని తెలిపారు. కేవలం అధికార పార్టీకి అనుకూలంగా ఉండే వారికి మాత్రమే పనులు కల్పించాలని ఒత్తిళ్లు వస్తున్నాయని తెలిపారు. ఇంతటి దౌర్భగ్యపు పరిస్థితులు మునుపు ఎన్నడు లేవని చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలి డిమాండ్ చేశారు.

## రావిపాలెంలో బార్కో రైతులతో అనకాపల్లి ఆర్డీవో సమావేశం



**అచ్చుతాపురం, మే 13, మేజర్‌న్యూస్:** అచ్చుతాపురం మండలం రావిపాలెం గ్రామంలో ఆర్డీవో అధ్యక్షతన రియాబిలిటేషన్ కోసం గ్రామ సభ జరగనిది ఈ రియాబిటేషన్ లో 62 మంది పేర్లు ఇవ్వడం జరిగింది ఇంకా చాలా పేర్లు నమోదు కావాల్సి ఉన్నది ఈ పేర్లన్నీ పూర్తిగా ఇవ్వమని కోరడం జరిగింది అలాగే ఢీ పట్టా కి 60 లక్షలు చెప్పినవమని బార్క్ రోడ్ ఉన్న రోడ్నే ఎక్స్టెన్షన్ చేయమని గ్రామాన్ని తరలించమని లేనిపక్షంలో ప్రతి కార్డు కి 5 సెంట్లు ఇవ్వమని ఇనాం భూములకు రిజిస్ట్రేషన్ పర్మిషన్ ఇవ్వమని గడ్డా పురంబోకులకి బీముకి నష్టపరిహారం ఇవ్వమని కోరడం జరిగింది.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి వేతనాలు ఇవ్వాలని కోరుతూ జీపు జాత



**లక్కవరపుకోట, మే 13, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వము ప్రవేశ పెట్టిన 4 లేబర్ కోడ్ లు కారణంగా కార్మికులు నష్టపోయి బానిసలుగా మారె ప్రమాదం ఉందని కొత్తగా ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్ లు రద్దు చేసి కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ సి ఐ టి యూ ఆధ్వర్యములో ఈ నెల 4 నుంచి 14 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జీపు జాతా మంగళ వారం ఎల్ కోట మండల కేంద్రానికి రావడం తో సి ఐ టి యూ నాయకులు కార్మికులు స్వగతం పలికేందుకు తరలి వచ్చారు ఈ సనార్భంగా జిల్లా సి ఐ టి యూ నాయకులు పీ శంకర్రావు మాట్లాడుతూ దేశం లో అధికారం లోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వము కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ కార్పొర్లుకు మేలు చేసే చట్టాలు చేస్తున్నారని కార్మిక చట్టాలను మార్చి కొత్త లేబర్ కోడ్ లు తేవడం ద్వారా 180 రకాల కార్మికుల హక్కులు రద్దు అవుతున్నాయని కార్మికుల హక్కులు పూర్తిగా పోయి వారిని కట్టుబానిసలుగా చేసే కుట్రలో భాగమే ఈ కొత్త లేబర్ కోడ్ లు అని వీటిని రద్దు చేసి కార్మిక చట్టాలు యధావిధిగా అమలు చేయాలనీ ఈ నెల 20 న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొని ఒక్క రోజు సమ్మెను జయప్రదం చేసి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలన్నారు ఈ కార్యక్రమం లో మండల నాయకులా తరిని వెంకటరమన గాడి అప్పారావు దేవి తదితరులు పాల్గొనగా జిల్లా కార్యదర్శి కె సురేష్ యూ ఎస్ రవి కుమార్ బి సూర్యనారాయణ సుధారాణి తదితరులు పాల్గొన్నారు

## పీ ఎం కిసాన్ పొందేందుకు చివరి తేదీ 20 ఏ ఓ

**లక్కవరపుకోట, మే 13, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ లో అన్నదాత సుఖీభవ -పీ ఎం కిసాన్ పథకం లో భాగంగా రైతులు కు రూపాయలు 20000 ఇచ్చే కార్యక్రమం లో భాగంగా రైతుల భువివరాలు వెరిఫికేషన్ ప్రక్రియ అన్ని రైతు సేవ కేంద్రాలు లో జరుగుతుంది. కావున రైతులు మీ యొక్క 1 , ఆధార్ కార్డు, రేషన్ కార్డు వివరాలు తీసుకోని మీ సమీపంలో ఉన్నా రైతు సేవ కేంద్రంకు వెళ్లి ల్యాండ్ వెరిఫికేషన్ ప్రక్రియ చేయించుకోవాలని ఎల్ కోట మండల వ్యవసాయశాఖ అధ్కిరిణి స్వాతి కుమారి రైతులకు సూచించారు ఈ వెరిఫికేషన్ చేసుకోటానికి ఈ నెల 20 వ తారీకు చివరి తేదీ కావున ఆ తేదీ లోపల రైతులందరు మీ రైతు సేవ కేంద్రం కు సంప్రదించాలన్నారు. అదేవిధంగా అన్ని రైతు సేవ కేంద్రల్లో పచ్చి రొట్ట విత్తనాలు జీలుగా కట్టి జనుమా, పిల్లి పెసర 50% రాయితీ తో ఉంచటం జరిగింది అని .ఆ విత్తనాలు కావాల్సిన రైతులు మీ ఆధార్ పట్టుకొని వెళ్లి విత్తనాలు తీసుకోవాలని తెలిపారు

## పైడి తల్లి అమ్మవారి పండుగలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శంభంగి



**బొబ్బిలి, మే 13, మేజర్‌న్యూస్:** బొబ్బిలి నియోజకవర్గం బొబ్బిలి మండలం కమ్మ వలస, బాడంగి మండలం వాడాద గ్రామాల్లో పైడితల్లమ్మ దేవత పండగ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.పైడితల్లమ్మ గ్రామ దేవత ఉత్సవాలు ఆహ్వానం వరకు బొబ్బిలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆయన సోదరులు శంబంగి వేణుగోపాల నాయుడు హాజరయ్యారు.ఆయా గ్రామాల్లో పైడితల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి గ్రామాలలో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కమ్మవలస సర్పంచ్ పిల్లా వసుంధర బొబ్బిలి,బాడంగి, మండలాలకు చెందిన వైసిపి ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## ప్రమాద సమయంలో అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలకు పిలుపు



**శ్రీకాకుళం, మే 13, మేజర్‌న్యూస్:** ప్రమాద సమయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ లో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్, తదితర శాఖలు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉగ్రవాదులు, ఇతర దేశాల నుండి దాడి జరిగితే ఏమి చేయాలి అనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కలెక్టరేట్ లో ఉన్న కంట్రోల్ రూంకు ప్రమాదం పై కలెక్టరేట్ కు సమాచారం ఇస్తే అక్కడ నుండి పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, సివిల్ డిఫెన్స్, ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్, తదితర శాఖలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రమాదంలో 300 మంది గాయాలు పాలవగా 34 మంది తీవ్రంగా గాయపడగా 9 మంది మృతి చెందారని, 15 మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు చెప్పారు. ప్రమాదాల సమయంలో ప్రజలకు ఏ విధమైన సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. రహదారులు మరియు భవనాలు శాఖ రోడ్లు క్లియర్ చేయడం, పైడి భీమవరం వద్ద గల ఫార్మా కంపెనీలు గ్రామస్తులను అప్రమత్తత చేయు నిమిత్తం సైరన్ మ్రోగిస్తారని చెప్పారు. పలాసలో రైల్వే స్టేషన్ లో ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. భవిష్యత్తులో ఏ విధంగా ప్రమాదాలు సంభవించినా సహాయక కార్యక్రమాలు చేయడం జరుగుతుందని వెల్లడించారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ..జిల్లాలో ఇప్పటికే ఆమదాలవలస, పలాస రైల్వే స్టేషన్లో ప్రజలకు అత్యవసర, విపత్కర పరిస్థితులలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ఏ విధంగా స్వీయ రక్షణ పొందడం, పోలీసు, రెవిన్యూ, అగ్ని మాపక శాఖల వంటి ప్రభుత్వ విభాగాలు సహాయక చర్యలు చేపడతాయని ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ సివిల్ మాక్ డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో ఉగ్రవాదుల దాడులు, పేలుడు పదార్ధాలు ఉన్నాయని సమాచారం మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూమ్ కి వచ్చిన సమాచారం మేరకు జిల్లాలో వివిధ విభాగాలు ఏ విధంగా తక్షణ స్పందించి ఘటన స్థలానికి చేరుకొని ప్రజల రక్షణ, నియంత్రణ చర్యలు ఏ విధంగా తీసుకోవడం జరుగుతుందని ఈ సివిల్ మాక్ డ్రిల్ రూపంలో నిర్వహించడం జరిగిందని ఇందులో చిన్న చిన్న లోపాలు జిల్లా కలెక్టర్ తో పాటు తాను గుర్తించడం జరిగిందని లోపాలు సరిదిద్ది మరికొన్ని చోట్ల ఇలాంటి మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. దేశ సరిహద్దుల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో జిల్లాలో ఉగ్రవాదులు దాడులు జరిగినప్పుడు సమీపాన పౌరులు తమకు తాము ఏ విధంగా స్వీయ రక్షణ పొందాలి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ఆర్.టి.సి.కాంప్లెక్స్ లో పోలీసు, రెవిన్యూ, అగ్ని మాపక, హెల్త్, అర్. టి. సి, ఎస్.డి.ఆర్ ఎఫ్.ఎస్ ఇతర శాఖలు సమన్వయంతో ఈ సివిల్ మాక్ డ్రిల్ ను నిర్వహించి ప్రయాణికులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు.ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, డిఎస్పీ సిహెచ్ వివేకాన ంద, ఎఆర్ డిఎస్పీ శేషాద్రి, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్ కుమార్, ఎపి స్టేట్ ఆర్డీ ఎఫ్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, తదితర శాఖలు మాక్ డ్రిల్‌లో పాల్గొన్నాయి.

## రక్తదానంతో ప్రాణదాతలు కండి

### - ఎఒఎల్ రక్తదాన శిబిరంలో వక్తలు పిలుపు



**శ్రీకాకుళం, మే 13, మేజర్‌న్యూస్:** ఆధ్యాత్మిక వేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ జన్మదిన సందర్భంగా ఎఒఎల్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ..ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయగల రక్తదాన శిబిరం నిర్వహణకు గురూజీ శిష్యులు ముందుకు వచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సెంటర్ లో జరిగిన ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ వి.జగన్మోహన రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు రక్తదానం చేయడం ద్వారా గురు దక్షిణ సమర్పించుకుంటున్నారని, ఇది అన్ని దానాల్లో గొప్పదిగా కొనియాడారు. ప్రముఖ న్యాయవాది టి. సూధారాణి మాట్లాడుతూ కరోనా తరువాత రక్తదాతలు తగ్గడం బాధాకరమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అవకాశమున్న వారందరూ రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు. డిడిసి సభ్యులు బి వి రవిశంకర్, శిల్లా రమేష్ మాట్లాడుతూ ఆరోగ్య భారతానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ చేస్తున్నా కృషిని వివరించారు. పెంకి చైతన్య కుమార్ నిర్వహణలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో బి వి రవిశంకర్, కొారి ఆదినారాయణ, వి సచ్చిన్, టి.జోగారావు తదితరులు రక్తదానం చేశారు.

## గౌతమ బుద్ధుని బోధనలు అందరికీ మార్గదర్శకాలు

### - లైన్స్ క్లబ్ మార్కెటింగ్ చైర్పర్సన్ ఉర్లం.శివతేజ



**శ్రీకాకుళం, మే 13, మేజర్‌న్యూస్:** గౌతమ బుద్ధుని బోధనలు అందరికీ మార్గదర్శకాలని లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ చైర్పర్సన్ ఉర్లం.శివతేజ మంగళవారం అన్నారు. గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా ఉర్లం. శివతేజ మాట్లాడుతూ గౌతమ బుద్ధుని బోధనలు ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా వినాలని, ఆయన జీవిత చరిత్రలో శాంతి, అహింసా, స్త్రీ, సత్యాలకు ఎక్కువ ప్రాముఖ్యతని ఇచ్చారన్నారు. బుద్ధుని బోధనలు వింటే జీవితంలో ఎలా బ్రతకాలో అర్థమౌతుందని, అందరూ ఆయన పాటించే ఐదు సూత్రాలను తెలుసుకుని ఆచరిస్తే తప్పక మనలో సత్ప్రవర్తన, సేవా రూప నియమావళితో జీవిస్తామన్నారు. పరులకు సహాయపడటం గొప్పవిషయమని, బౌద్ధం స్వేచ్ఛ, సమానత్వం అత్యున్నత విలువనిచ్చిందని, కుల, మత రహిత సమ సమాజ స్థాపనకు పూనుకొని దాన్ని ఆచరణలో పెట్టి భారతదేశ సమాజానికి ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. బౌద్ధంలో స్త్రీకి అత్యున్నతమైన విలువ, గౌరవం, స్వేచ్ఛను కల్పించింది. ఇలాంటి బౌద్ధం భారతదేశ సమాజానికే కాదు యావత్ ప్రపంచ వర్తమాన, భవిష్యత్తుకు ఒక గొప్ప దార్శనికంగా ఆదర్శప్రాయంగా ఉంటుందన్నారు.

## శ్రీ పోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**ఆరిలోవ, మే 13 మేజర్‌న్యూస్:** జీవిఎంసీ, 9వ వార్డు గ్రామ దేవత శ్రీ పోలమాంబ అమ్మవారి కి నెల పండుగ సందర్భంగా వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మోటర్లు బాగైనాయి.. పైప్ లైన్ విరిగింది..



**నరసన్నపేట, మే 13, మేజర్‌న్యూస్:** నరసన్నపేట పట్టణ ప్రజలకు దాహార్తి తీర్చేందుకు గ్రామపంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు చేసిన కృషి ఒక్కరోజు ముచ్చటగానే మిగిలింది. గత నెల రోజుల నుండి త్రాగునీటి సప్లై లో సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు, మోటర్లు పనిచేయడం మొదలెట్టగానే నీటి కొరత తీరిందని సంతోషపడ్డారు. మళ్లీ సప్లై కి బ్రేక్ పడింది. గుండివిల్లిపేట వద్ద పైపులైను విరగడంతో మరో రోజో, రెండు రోజులో నీటి కష్టాలు తప్పేటట్టులేదు. మేజర్ పంచాయితీలో త్రాగునీటి సమస్య పెద్ద సమస్యగా మారింది. దేవాది నుండి పట్టణానికి తరలించే త్రాగునీటి పైప్లైన్ ఏదో ఒకచోట ప్రతినిత్యము సమస్య ఏర్పడుతుండడంతో వాటి నిర్వహణకు పంచాయితీ అహర్నిశలు శ్రమించవలసి వస్తుంది. అయినప్పటికీ ప్రజలకు త్రాగునీటి కష్టాలు తప్పడం లేదు. వేసవికాలంలో ఈ సమస్య తీవ్రతరం అవుతుంది. ఈ విషయాన్ని మేజర్ పంచాయతీ ఈవో ద్రాక్షయిణి వద్ద ప్రస్తావించగా పైప్లైన్ మరమ్మత్తుల నిర్వహణకు గ్రామ పంచాయతీ త్రాగునీటి సిబ్బంది పనులు నిర్వహిస్తున్నారని, సాధ్యమైనంత త్వరగా పట్టణ ప్రజలకు రెండు పూటలా త్రాగునీరు సరఫరా చేస్తామన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి




**పలాస, మే 13,మేజర్‌న్యూస్:** ఈ నెల 20 న జరగబోయే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ,ఐ.యఫ్ టి.యు,ఏ.ఐ.సి.సి.టి.యు నాయకులు పిలుపు నిచ్చారు.మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమ్మె సన్నాహక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ లు వల్ల కార్మిక వర్గం బానిసత్వం లోకి నెట్టేయ బడతారని అన్నారు.ఈ సమ్మె ద్వారా లేబర్ కోడ్ లు రద్దు కోసం పోరాటానికి సిద్ధం చేయాలని కోరారు.కనీస వేతనాలు,ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ,అసంఘటిత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు,స్కీమ్ వర్కర్ల ను ఉద్యోగులుగా గుర్తింపు వంటి సమస్యలపై ఈ సమ్మె జరుగుతుంది అని తెలిపారు. కార్మికులు అంతా ఈ సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి,ఏ ఐ.సి.సి.టి.యు నాయకులు కె దుష్యంత్,కె లోకనాదం,ఏ.ఐ.కె.యం.యస్ నాయకులు వి మాధవరావు,ఏ.ఐ.కె.యం నాయకులు పి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరు కళాశాలకు కొత్త ప్రిన్సిపాల్

**- సుదీర్ఘ కాలం తర్వాత పూర్తి స్థాయి ప్రిన్సిపాల్ నియామకం**



**కొత్తూరు, మే 13, మేజర్‌న్యూస్:** కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సుదీర్ఘ కాలం తర్వాత ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పూర్తి స్థాయి ప్రిన్సిపాల్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ఆమదాలవలస జూనియర్ కళాశాల లో పనిచేస్తున్న బోటనీ లెక్చరర్ గా పనిచేస్తున్న గణపతి ధనుంజయరావు ను పదోన్నతి పై కొత్తూరు కళాశాల ప్రిన్సిపాల్ గా నియమించింది. ఆయన కళాశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించారు.సుమారు నాలుగేళ్లు పాటు కళాశాలకు పూర్తిస్తాయి ప్రిన్సిపాల్ లేరు. కాళాశాలకు చెందిన రసాయన శాస్త్ర ఉపన్యాసకులు బండారు రవి కుమార్ ప్రిన్సిపాల్ గా పూర్తిస్తాయి అదనపు భాధ్యతలు చేపట్టారు. ధనుంజయరావు ప్రిన్సిపాల్ గా చేరిన వెంటనే రవికుమార్ విధులు నుండి వైదొలగారు. బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ కు లెక్చరర్లు, సిబ్బంది స్వాగతం పలికారు.

# కిశోర బాలికల సాధికారిత పై అవగాహన..



**జలుమూరు, మే 13, మేజర్‌న్యూస్:** తిమడాం గ్రామంలోని అంగన్వాడి సెంటర్ నందు మంగళవారం ఉదయం కిశోర బాలికల హక్కులు, రక్షణ కోసం, ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు, కిశోర బాలికల సాధికారిత, ఫోక్షో చట్టము దాని పనితీరుపై మహిళా పోలీస్ మంజుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిషోర్ వికాస కార్యక్రమంలో భాగంగా పెరిగే వయసులో బాలికల శారీరక, మానసిక, అలజడలు, రుగ్మతలపై అవగాహన కల్పిస్తూ, సమాజంలో జరుగుతున్న నేరాలు పట్ల ఎటువంటి అవగాహన కలిగి ఉండాలి అనే అంశాలపై, వేసవి సెలవులను విజ్ఞానవంతంగా ఫలప్రదాంగా వినియోగించుకునేందుకు సెషన్ ఫోర్ కార్యక్రమాలను కిశోర బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్తలు ఈశ్వరమ్మ , సుశీల, ఆశ కార్యకర్త సత్యవతి, కిశోర్ బాలికలు గ్రామస్తులు హాజరయ్యారు.

# ఫోక్సో కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలి

**- జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి**




**శ్రీకాకుళం, మే 13, మేజర్‌న్యూస్:** మైనర్ బాలికలు పై జరిగే శారీరక, లైంగిక వేధింపులు నేరాలు అరికట్టేందుకు నేరస్తలపై ఫోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి ఫోక్సో చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని,క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసులలో నేరస్తులకు శిక్షలు పడేలా కేసులు దర్యాప్తు ఉండాలి అని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నుంచి జూమ్ కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న డిఎస్పీ, సీఐ, ఎస్సై లతో ఫోక్సో ,క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసులు దర్యాప్తు,విచారణ,కేసు ఫైల్ ప్రస్తుత స్థితి, కేసులో సాదించిన పురోగతి తదితర అంశాలపై అదనపు ఎస్పి కెవి రమణ తో కలసి సమీక్షించారు.అపరిష్కృతంగా ఉన్న ఫోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తులో పురోగతి సాధించాలని ఈ క్రమంలో ముందుగా పెండింగ్ ఫోక్సో కేసుల వివరాలను స్టేషను వారీగా క్షుణ్ణంగా పరిశీలించి కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతి,సాంకేతిక ఆధారాలు,చేపట్టిన చర్యల పై ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలు పై జరిగే నేరాలలో పిర్యాదు అందిన వెంటనే కేసు రిజిస్టర్ చేసి సమగ్రంగా కేసులు దర్యాప్తు చేపట్టాలన్నారు.క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసులో నిర్ణీత 60 రోజులు లోపాల కేసుల అభియోగ పత్రాలు పూర్తి స్థాయిలో దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో దాఖలు చేయాలన్నారు.సదురు కేసులు దర్యాప్తు పెండింగ్ నకు గల కారణాలు పై ఆరా తీసి నిశితమైన ఆధారాలతో కేసులు దర్యాప్తు పూర్తి చేయాలన్నారు.స్కూల్, కాలేజీల, పబ్లిక్ ప్రదేశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి మహిళ భద్రత చర్యలు చేపట్టాలన్నారు. స్కూల్,కాలేజీల వద్ద శక్తీ బృందాలు తో పోలీసు పెట్రోలింగ్ పెంచాలన్నారు. విద్యార్థి,విద్యార్థినులకు ఫోక్సో,మహిళ చట్టాలు,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వించాలని పలు అంశాలపై జిల్లా ఎస్పి దిశ నిర్దేశలు చేశారు. ఈ వర్చువల్ సమీక్షా సమావేశంలో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పి తోపాటు అదనపు ఎస్పి కెవి రమణ, డిసిఆర్బి సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు గోవింద రావు, నేతాజీ పాల్గొన్నగా, జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు వారి వారి పోలీసు స్టేషను, కార్యాలయాలు నుంచి పాల్గొన్నారు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**- ఆధ్యాత్మిక శోభతో విలసిల్లుతున్న నరసన్నపేట.**

**- ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యలు ఆధ్వర్యంలో ప్రతిరోజు వాహన సేవ**



**నరసన్నపేట, మే 13, మేజర్‌న్యూస్:** నరసన్నపేట పట్టణ నడిబొడ్డున గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 151 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని పొట్నూరు వంశీకులు నిర్మించారు. అప్పటినుంచి ఆలయ ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. అప్పటినుండి ఇప్పటివరకు తిరుమల వెంకన్నను కొలిచిన ట్టుగానే ఇక్కడ వేంకటేశ్వర స్వామికి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు . భీమవరం శ్రీభాష్యకార సిద్దాంత పీఠాధిపతి త్రిదండి రామచంద్ర రామానుజ జియర్ స్వామి ఆధ్వర్యంలో 2010లో 14 నదుల నుంచి జలాలు తీసుకువచ్చి 1008 కల శాలతో మహా కుంబాభిషేకం నిర్వహించారు.అప్పటినుంచి వేంకటేశ్వర స్వామి మరింతగా భక్తుల నమ్మకాన్ని పొందుతూ పూజలందుకుంటున్నారు. ఇంతటి విశిష్టత కలిగిన ఈ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి సాయి కృష్ణమాచార్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు.

**రోజుకో వాహన సేవ..** ఈ నెల 7వ తేదీ నుండి ప్రత్యేక పూజల ద్వారా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 8న హంసవాహన సేవ, 9న శేష వాహన సేవ, 10న అశ్వ వాహన సేవ, 11న హనుమంతు వాహన సేవ, 12న గరుడ వాహన సేవ, 13న సింహ వాహన సేవ, 14న చంద్రప్రభ వాహన సేవ, 15న గజ వాహన సేవ, 16న సూర్యప్రభ వాహనసేవ నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి సాయి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలోబ్రహ్మోత్సవాల వార్షిక పూజలు, వాహన సేవ, విశేషపూజా కార్యక్రమాల ఆధ్యాత్మిక శోభతో ఆలయ ప్రాంగణముతో పాటు, నరసన్నపేట పట్టణాన్ని ఆధ్యాత్మికశోభతో నింపేశారు. నరసన్నపేట పట్టణంలోని ప్రజలకు స్వామివారి దర్శన భాగ్యం ప్రతిరోజు లభిస్తుంది. పట్టణంలోని పెద్ద పేట రహదారి నుండి మొదలైన స్వామివారి వాహన సేవ ఉత్సవం, కోలాట బృందాలతో, భజన బృందాలతో పట్టణ ప్రజలకు స్వామివారి దర్శన భాగ్యం కలిగిస్తున్నారు. 16వ తేదీన నరసన్నపేట పంచాయితీ కళా మండపంపై శ్రీ వెంకటేశ్వర కళ్యాణము, శివ కళ్యాణము, రామ కళ్యాణం నిర్వహించేందుకు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి సాయి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. మూడు కళ్యాణ భాగ్యాలను వీక్షించే అవకాశం పట్టణ ప్రజలకు దక్కనుంది. అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు విశేషంగా పాల్గొంటున్నారు. భక్తులందరికీ విశేష పూజలతో పాటు స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకులు అందిస్తున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలను ఆగమ శాస్త్ర నియమాలు అనుగుణంగా వేద పండితులు నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో ప్రతిరోజు పాల్గొంటున్నారు.

# ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం



**మెలియాపుట్టి, మే 13, మేజర్‌న్యూస్:** అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా ఫారం పాండ్ నిర్మాణాలు జరిగేలా చూడాలని ఎంపీడీవో. పండా అన్నారు. మంగళవారం మెలియా పుట్టి ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతుల వ్యవసాయ పొలాలలో ఫారం పాండ్స్ నిర్మాణాలు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు అన్ని గ్రామాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాలలో ఫారం పాండ్స్ , నీటి తొట్టెలు ఎన్ని నిర్మించారు ప్రణాళికల గురించి చర్చించారు. పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఉపాధి ఏపీవో టి రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, బిటి నాయుడు, టీసీలు, తదితరులు ఉన్నారు.


## దుం(బ్రిగుడ (గ్రంథాలయంలో కబడ్డీ పోటీలు



**దుం(బ్రిగుడ, మే 13, మేజర్‌న్యూస్:** దుం(బ్రిగుడ శాఖ (గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళ వారం ఇక్కడి (గ్రంథాలయంలో (గ్రంథాలయ అధికారిణి శెట్టి సునీత చిన్నారులకు కబాడీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 18 మంది చిన్నారులు పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా ముందంజ లో ఉండాలని ఆమె చెప్పారు.పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు (ప్రధానం చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్య(క్రమంలో సిబ్బంది కమ్మిడి సుబ్బారావు పాల్గొన్నారు.

## దుం(బ్రిగుడలో భారీ వర్షం

**- నివాస గృహాల్లో చొరబడిన వరద నీరు**



**దుం(బ్రిగుడ, మే 13, మేజర్‌న్యూస్:** దుం(బ్రిగుడ మండల కేం(ద్రంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయం(త్రం వరకు ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో కొండపై నుంచి వరద నీరు (గ్రామంలో పలు నివాస గృహాల్లో చేరడంతో (గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కురవడంతో సరైన (డైనేజీలు లేకపోవడం వల్ల కొండ కోనలపై నుంచి వరద నీరంతా (గ్రామంలో ఉప్పొంగి (ప్రవహిస్తూ వీధులంతా జలామయం అవడంతో (గ్రామస్తులు భయ(భ్రాంతులకు గురయ్యారు. కొందరి నివాసగృహాల్లో వరద నీరు పూర్తిగా (ప్రవాహంలో రావడం వల్ల వరద నీరును వేరే మార్గంకు చూపించేందుకు పలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై మండల అధికారులు స్పందించి (గ్రామంలో వరద నీరు రాకుండా ఉండేందుకు (డైనేజీలు పూర్తిగా నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని (గ్రామస్తులు కోరుతున్నారు.

## మహిళలు అని రంగాల్లో రాణించాలి..

**- వాసవ్య మహిళా మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ కుమార్**




**చింతపల్లి, మే 13, మేజర్‌న్యూస్:** మహిళలు అన్ని రంగాలలో రాణించి, అభివృద్ధి చెందాలని వాసవ్య మహిళా మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మీర్ విజయ్ కుమార్ అన్నారు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వాసవ్య మహిళా మండలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా కార్య(క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల మహిళలు డిజిటల్ నైపుణ్యం, సురక్షిత ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి పై ఇచ్చిన శిక్షణ తరగతులపై మహిళలు అవగాహన పెంచు కోవాలని అన్నారు.నేటి పోటీ (ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండి, అభివృ ద్ధి చెందేలా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ శిక్షణలో డిజిటల్ నెపుణ్యత, సురక్షిత ఆరోగ్యం, వ్యవస్థాపకత" వంటి అంశా లపై మహిళలకు, వాసవ్య మహిళా మండలి సభ్యులు అవగాహన కల్పించారు.. ఈ కార్య(క్రమం లో వరంగల్ ఎన్ఐటి (ప్రొఫెసర్ డా. బి. స్ఫూర్తి, (ప్రాజెక్ట్ డైరెక్టర్ (శ్రీమతి సునీత, (ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, కౌన్సిలర్లు, కమ్యూనిటీ కో-ఆర్డి నేటర్లు తో పాటు చింతపల్లి మండలంలో ని 20 స్వయం సహాయ సంఘాల సభ్యుల హాజరయ్యారు.

## రాకాసమ్మ దేవి జాతరలో త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు

**- ట్యాంకుల ద్వారా నీటి సరఫరా**

**- లంబసింగి సర్పంచ్ శాంతి కుమారి, మాజీ సర్పంచ్ రఘునాథ్**



**చింతపల్లి, మే 13, మేజర్‌న్యూస్:** మండలంలోని లంబసింగి పంచాయతీ బురదవీధి (గ్రామంలో జరుగుతున్న రాకాసమ్మ దేవి జాతర సందర్భంగా (ప్రజలు త్రాగునీటి సమస్య రాకుండా/లేకుండా చర్యలు తీసుకుంటు న్నామని ఆ పంచాయతీ సర్పంచ్ కొ(ర శాంతి కుమారి, మాజీ సర్పంచ్ రఘునాథ్ లు అన్నారు. మంగళవారం వారు మాట్లా డారు.వేసవికాలం దృష్ట్యా మన్యంలో త్రాగునీటి సమస్య ఉన్నప్పటికీ, మన్య (ప్రాంతంలో జాతర లు జరుగు తున్న (ప్రతి చోట ఆయా పంచాయతీల సర్పంచులు త్రాగునీటి సమస్య తాత్కాలిక పరిష్కారానికి ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తు న్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ (క్రమంలోనే ఆం(ధ - కశ్మీర్ గా పేరొందిన లంబసింగి పంచాయితీ బురదవీధి (గ్రామంలో రాకా సమ్మ దేవి జాతరను పుర స్కరించుకొని (గ్రామస్తుల తో పాటు, జాతరకు వస్తున్న భక్తుల సౌకర్యార్థం త్రాగునీటి సమస్య తలెత్త కుండా అన్ని చర్యలు తీసు కుంటున్నా మన్నారు. ఇందులో భాగంగా ట్యాంక్ ల ద్వారా త్రాగు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.ఈ అవకాశాన్ని (ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపు నిచ్చారు.ఈ కార్య (క్రమం లో పంచాయతీ వార్డ్ సభ్యుడు రాజుబాబు, అధిక సంఖ్యలో (గ్రామస్తులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెంపు



**చింతపల్లి, మే 13, మేజర్‌న్యూస్:** ఏజెన్సీ లోని రింతాడ (గ్రామ సచివాలయం-1 లో రైతుసేవా కేం(ద్రం ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ మేరకు గూడెం కొత్త వీధి మండలం రింతాడ (గ్రామ సచివాలయం 1 పరిధిలోని రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ కార్య(క్రమం ను అగ్రికల్చర్ అసిస్టెంట్ జ్యోత్స్న, రైతు సాధికార సంస్థ ఐసీపీఆర్ వెంకటలక్ష్మి ల ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ లతో కలసి రైతులకు అందజేశారు. ఈ మేరకు పంపిణీ చేసిన పచ్చిరొట్ట విత్తనాల్లో జనుము ,పిల్లి పెసర, జీలుగు తదితర విత్తనాలు ఉన్నాయి.. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ (ప్రధాన పంట వేసే ముందు పొలంలో పచ్చి రొట్ట సాగు చేయాలన్నారు. 50 శాతం పూతదశలో ఉండగానే పొలం దున్నినప్పుడు, నేల గుల్ల బారడంతో పాటు 10 నుండి 20 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గించ వచ్చునన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన మన్య (ప్రాంత రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం తో పాటు ,ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకొని సచి వాలయం- 1 రావాలన్నారు .ఈ మేరకు 10 కిలోల విత్తనాల ప్యాకెట్టు ను రాయితీతో రూ.150 రూపాయలకు పొందవచ్చు నన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## పిడుగుపాటుకు గిరిజన రైతు మృతి

**అరకులోయ, మే 13, మేజర్‌న్యూస్:** మండలంలోని మాడగడ పంచాయతీ,మొంజగుడ (గ్రామానికి చెందిన గిరిజన రైతు సమర్ధి.డొంబు (45) పిడుగుపాటుకు మంగళవారం మరణించారు.ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురుస్తున్న సమయంలో మొంజగుడ (గ్రామ సమీపంలో భీకర శబ్దంతో పిడుగు పడింది. పశువులు,మేకలను మేతకు తీసుకువెళ్లి ఉన్న గిరిజన రైతు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ గిరిజన రైతుతో పాటు ఓ మూగ జీవి కూడా పిడుగుపాటుకు గురై మృత్యువాత పడింది.ఈ సంఘటన మంగళవారం మిట్ట మధ్యాహ్నం మొంజగుడ (గ్రామ సమీపంలో చోటు చేసుకుంది.

## కుల,మత, రాజకీయాలకతీతంగా (ప్రజాసేవ

**- మాజీ మం(త్రి పసుపులేటి బాలరాజు**



**అరకులోయ, మే 13, మేజర్‌న్యూస్:** కుల,మత, రాజకీయాలకతీతంగా (ప్రజలకు సేవ చేస్తున్నట్టు మాజీ మం(త్రి,వైయస్సార్ కాం(గెస్ పార్టీ గిరిజన నాయకుడు పసుపులేటి. బాలరాజు చెప్పారు. మండలంలోని బొండాం గిరిజన (గ్రామంలో మంగళవారం జరిగిన ఓ శుభ కార్య(క్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన స్థానిక ఐటిడిఏ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద విలేకరులతో మాట్లాడారు. దారి(ద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల సంక్షేమం కోసం రేయింబవళ్లు పనిచేస్తున్నట్టు ఆయన తెలిపారు.(ప్రజలు ముఖ్యంగా గిరిజనులకు నిస్వార్థంతో సేవలందిస్తూ వారి బాగోగుల కోసం నిరంతరం పనిచేస్తున్నామన్నారు.నిరు పేదల సంక్షేమం,అభివృద్ధి కోసం అవసరమైతే రోడెక్కుతామని ఆయన పేర్కొన్నారు.పేదల ఇబ్బందులను తొలగించేందుకు,అటువంటి వారి సమస్యలను పరిష్కరించేందుకు రోడెక్కక తప్పదని భావిస్తున్నామన్నారు.కేం(ద, రాష్ట్ర (ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులైన గిరిజనులకు దక్కాలంటే ఎంతవరకు వెళ్లడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు.(ప్రస్తుతం జవాబుదారితనం కొరవడిందని,దీంతో అర్హులైన అభం శుభం తెలియని అమాయక గిరిజనులు అనేక విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని,ఈ నేపథ్యంలో రోజురోజుకు దిగజారిపోతున్న నైతిక విలువలు,పారదర్శకత, బాధ్యతా భావంను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. నిబంధనల (ప్రకారం నడుచుకునే విధానాలపై (ప్రభుత్వ ఉద్యోగులకు, ముందస్తు జా(గత్తలతో మసలుకునే అంశంపై అన్ని వర్గాల (ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన పాలకులు,(ప్రభుత్వ ఉన్నతాధికారులకు సూచించారు.అవగాహన పెంపొందిస్తే చైతన్యం పెరిగి అవినీతి, అ(క్రమాలు, మోసాలు, దగాలు, మభ్య పెట్టే వంటి కార్యకలాపాలు తగ్గే అవకాశం ఉంటుందన్న అభి(ప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.రాజ్యాంగం కల్పించిన హక్కులు,చట్టాలను (ప్రభుత్వ యం(త్రాంగం సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యతను తరచూ గుర్తు చేస్తుండడం పట్ల మేలు జరిగే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.గిరిజనులు అ(ప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తులో అనేక విధాలుగా నష్టపోయే (ప్రమాదం ఉందన్నారు.జీవో నెంబర్3ను పునరుద్ధరించాలని, గంజాయి నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని మాజీ మం(త్రి,వైయస్సార్ కాం(గెస్ పార్టీ గిరిజన నాయకుడు పసుపులేటి బాలరాజు అన్నారు.

## కిశోర్ బాలికలు వ్యక్తిగత పరిశు(భత పై దృష్టి సారించాలి..

**- ఐసిడిఎస్ సిడిపిఓ రమణి**



**చింతపల్లి, మే 13, మేజర్‌న్యూస్:** కిషోర్ బాలికలు వ్యక్తి గత పరిశు (భత పై దృష్టి సారించాలని స్థానిక ఐ సి డి ఎస్. సి డి పి ఓ జి వి రమణ (రమణి) అన్నారు. చింతపల్లి ఐ సి డిఎస్ (ప్రాజెక్టు, కొత్త పాలెం తాజంగి సచివాలయం పరిధిలో కోరుకొండ,బలభ(ద్రం (గ్రామాల్లో కిశోర్ వికాసం, వేసవి సెలవుల కార్య(క్రమం పై అవగాహన కార్య(క్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కిశోర్ బాలికలు ఆరోగ్యం ,వ్యక్తిగత పరిశు(భత, రుతు(క్రమం పట్ల తీసుకోవలసిన జా(గత్తలు గూర్చి అవగాహన పెంచుకోవాలని అన్నారు .అలాగే బాల్య వివాహాలు వలన జరిగే అనర్థాలపై కిషోర్ బాలికల అవగాహన పెంచు కోవాలని సూచించారు..ఈ కార్య(క్రమంలో ఏ సిడిపిఓ రామలక్ష్మి , సూపర్ వైజర్ లు, అంగన్వాడి సిబ్బంది తో పాటు (గ్రామస్తులు, కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు.. ఈ కార్య(క్రమం లో భాగంగా, అంగన్వాడి సిబ్బంది , ఆధ్వర్యంలో ,కిషోర్ బాలికలు, (గ్రామస్తులతో కలిసి కోరుకొండ, బలబ(ద్రం (గ్రామాలలో కిషోర్ వికాసం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు..

## దేశ భద్రతకు షష్ఠ షణ్ముఖ క్షేత్రాలలో ప్రత్యేక పూజలు

**- ఎలమంచిలి ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్**



**అచ్చుతాపురం, మే 13, మేజర్‌న్యూస్:** తమిళనాడు లోని మధురై లో ఉన్న ప్రాముఖ్యమైన మధుర మీనాక్షి దేవాలయం, తిరుపురంకుంద్రమ్ అరుల్మిగు సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాలను దర్శించి దేశం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించిన యలమంచిలి నియోజక వర్గం శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ మన దేశ శ్రేయస్సు కోసం మన దేశానికి దైవ సంకల్పం తోడవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు మరియు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తలపెట్టిన మహా సంకల్పంతో యలమంచిలి శాసన సభ్యులు సుందరపు విజయకుమార్ నాయకత్వంలో 100 మంది జన శ్రేణులతో కలసి తమిళనాడు లోని మధురై లో ఉన్న ప్రాముఖ్యమైన మధుర మీనాక్షి దేవాలయం, తిరుపురంకుంద్రమ్ అరుల్మిగు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు (అర్చనలు, అభిషేకాలు, కల్యాణోత్సవం) నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ...మన భారత దేశానికి అనుకోని పరిస్థులలో ఏర్పడిన ఆపరేషన్ సింధూర్ జరిగిందని, ఈ లాంటి ఉదృక్త పరిస్థులల నేపథ్యంలో మన త్రివిధ దళాలకు మరియు దేశ ప్రధాని మోడీ బలం చేకూరాలని, రానున్న రోజుల్లో ఎన్ డి ఏ ప్రభుత్వం రాష్ట్రం మన దేశం సస్యశ్యామలంగా ఉండాలని మరియు అలా ఉండేందుకు ఈ ప్రత్యేక పూజల ఫలించాలని అని తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్నటువంటి దేవాలయాలకి , యలమంచిలి నియోజకవర్గం ఇంచార్జి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ నాయకత్వంలో 100 మంది జన శ్రేణులతో దర్శించి దేశ సౌభాగ్యం మరియు స్నేహపూర్వకమైన వాతావరణం నెలకొనడం కోసం పూజలు, అభిషేకాలు చేసే అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరొక సారి ధన్యవాదాలు తెలిపారు.

## సచివాలయ సిబ్బంది కొరత- రేషన్ కార్డ్ దరఖాస్తు దారులు ఇక్కట్లు



**రావికమతం, మే 13, మేజర్‌న్యూస్:** రేషన్ కార్డు దరఖాస్తు దారులకు దేవుడు వరమిచ్చిన పూజారి నిరాకరించిన చందంగా మారింది. కొత్త రేషన్ కార్డులకు, కొత్త మెంబర్లు చేర్పులు, చిరునామా మార్పులు, రేషన్ కార్డు నుంచి మెంబర్లు తొలగింపుకు గ్రామ సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీటి కోసం ఎంతో కాలంగ ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు కు కొండంత సంతోషాన్ని ఇచ్చింది. దీంతో దరఖాస్తుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో సచివాలయానికి వెళుతున్న వారికి నిరాసే ఎదురవుతుంది. చినపాచిల, పి. పొన్నవోలు తదితర సచివాలయాల్లో రేషన్ కార్డులుకు దరఖాస్తులు స్వీకరించేందుకు వెళ్లిన వారికి ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ఈనెల 30లోగా దరఖాస్తులకు గడువు ముగుస్తుండడంతో మెజార్టీ సచివాలయాల పరిధిలోని రేషన్ కార్డు అవసరమైన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎండిఓ వెంకన్న బాబును వివరణ కోరగా మండలంలో 22 సచివాలయాల గాను కేవలం 11 మంది వెల్ఫే అసిస్టెంట్లు మాత్రమే పనిచేస్తున్నారు. అలాగే మరొక 12 మంది డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారని, తెలిపారు. ఈ కారణంగా సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణకు ఆటంకం కలగడం వాస్తవమే అన్నారు. ఉన్నతాధికారు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా ప్రజలు ఇబ్బందులు తొలగింపుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## మే 20న జరిగే సమ్మెలో పాల్గొండి.....

**- సిఐటియు నాయకులు**



**కొయ్యూరు, మే 13, మేజర్‌న్యూస్:** మండలం ఉపాధి కూలీల సమస్యలపై మాట్లాడుతున్న సిఐటియు నాయకులు మే 20వ తేదీన జరిగే సమ్మెకు ఉపాధి కూలీలందరూ హాజరై సమ్మెను జయప్రదం చేయాలని, ఉపాధి కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, రోజుకు 600 రూపాయలు చెల్లించాలని, పని ప్రదేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పనిని తొలగించే ఉద్దేశంతో కుట్ర పన్నుతున్నాయని ఇప్పటికే ఉపాధి పనులు మిషనరీ తో చేయించడం తగదని, 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో రోడ్లను వెంటనే రిపేర్లు చేయండి

**- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కొణతాల**



**అనకాపల్లి ప్రతినిధి, మే 13, మేజర్‌న్యూస్:** నియోజకవర్గం లో ఆర్ అండ్ బి రోడ్లను తొందరగా రిపేర్లు నిర్వహించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని మాజీ మంత్రి అనకాపల్లి ఎమ్మెల్యే కొండతాల రామకృష్ణ అధికారులను ఆదేశించారు ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ క్యాంప్ కార్యాలయంలో ,అనకాపల్లి ఆర్ బి ఏఈ, ప్రభుదాస్ కు నియోజకవర్గంలో గల కొత్తూరు పంచాయతీ ఏ ఎమ్ ఎల్ కాలేజీ ఫ్లైఓవర్, కొత్తూరు రోడ్డు పనులు, తుమ్మపాల చినబాబు కాలనీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, అమృత్ పథకం డిఈ,కశింకోట మండలం తాహ సిల్దార్, సివిల్ సప్లై డిటి మరియు రెవెన్యూ అధికారులు తో కూడా ప్రత్యేకంగా సమావేశమై వారి పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు మరియు చేయవలసిన పనులు గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పన, సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరానని తెలిపారు.

## 17న అనకాపల్లిలో సివిల్స్, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పై సదస్సు

**అనకాపల్లి ప్రతినిధి ,మే 13, మేజర్‌న్యూస్:** నిరుద్యోగుల శిక్షణా కేంద్రం, ఉపాధి కల్పనకు దిక్సూచి ప్రసిద్ది చెందిన అనకాపల్లి శ్రీ గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు వైజాగ్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో శ్రీ గౌరీ గ్రంథాలయంలో యుపీఎస్సీ (సివిల్స్), ఏపీపీఎస్సీ గ్రూప్%-%1 పోటీ పరీక్షలకు అవగాహన సదస్సు జరగనున్నదని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రధాన బోధకులుగా వైజాగ్ ఐఏఎస్ అకాడమీ డైరక్టర్ గౌతమ్ పోతల, బోధకులుగా యుపీఎస్సీ (సివిల్స్)%-%2025 విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని మానస, మరికొంతమంది నిష్టాతులు హాజరవుతారన్నారు. సివిల్స్, గ్రూపు%-%1 పరీక్షల ప్రాధాన్యత, అర్హత, పరీక్ష, సిలబస్, దేశ పాలనలో సమర్థత, ప్రజా సేవ, పాలసీల అమలు, దేశాభివృద్ధి, న్యాయం, సమర్థవంతమైన పరిపాలన అంశాలపై సదస్సులో అవగాహన కల్పిస్తారన్నారు. సదస్సుకు హాజరు కాదలచిన ఔత్సాహిక విద్యార్థులు ముందుగా తమ పేర్లును నమోదు చేసుకోవాలని కాండ్రేగుల వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9247166511 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## టిడిపి సీనియర్ కార్యకర్త మృతి

**- పార్టీ జెండా కప్పి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పీలా**



**కశింకోట, మే 13, మేజర్‌న్యూస్:** మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం కార్యకర్త, బయ్యవరం పంచాయతీ మాజీ ఉపసర్పంచ్, మాజీ టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు కలగా సన్యాసినాయుడు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ బోర్డు చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కాయల మురళి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ బాబర్, మాజీ డిసిసిబి డైరెక్టర్ శ్రీరెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ వేది గోపికృష్ణ, ఉగిన పాలెం మాజీ సర్పంచ్ కలగా సోమేశ్వరరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగిన రమణమూర్తి తదితరులు కలగా సన్యాసినాయుడు మృతదేహాన్ని సందర్శించి తెలుగుదేశం పార్టీ జెండాను భౌతికకాయంపై కప్పి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సన్యాసినాయుడు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటాదని పీల గోవింద సత్యనారాయణ చెప్పారు.

## మున్సిపల్ అధికారులు, సిబ్బంతో సమీక్ష సమావేశంలో

**- పాల్గొన్న కమిషనర్ రామలక్ష్మి**

**బొబ్బిలి, మే 13, మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి



ఉత్తర్వుల మేరకు మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధించిన అధికారులు సిబ్బంది తో మంగళ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొబ్బిలి పురపాలక సంఘం పరిధిలో గల వీధి విక్రయదారులను గుర్తించి వారిని ఆన్లైన్ లో నమోదు చేయుట, వెండర్స్ తో మాట్లాడి వెల్ఫేర్ సెక్రెటరీలు, ప్లానింగ్ సెక్రెటరీల ద్వారా సర్వే చేసి ఆ డేటాను వెల్ఫేర్ సెక్రటరీ ల లాగిన్ నుండి సిఎంఎం లాగిన్ లో వెరిఫై చేసాక కమిషనర్ లాగిన్ లో అప్లోడ్ చేయాలి. ఇందుకు గాను ప్రస్తుతం ఉన్న వీధి విక్రయదారులు, స్వానిధి విక్రయదారులు, క్రొత్తగా నమోదు కావలసిన వీధి విక్రయదారులుగా మూడు కేటగిరిలుగా నమోదు చేయాలి. ఈ నమోదు కార్యక్రమం మే నెల 17 వ తేదీ నాటికి 100% పూర్తి చేయాలని, టౌన్ వెండింగ్ కమిటీ ఏర్పాటు చేసి వీధి విక్రయదారులకు వెండింగ్ సర్టిఫికెట్, గుర్తింపు కార్డు సమకూర్చవలెనని చెప్పడం జరిగింది. అలాగే టౌన్ ప్లానింగ్ సెక్రెటరీల ద్వారా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలను ఆదేశించడమయినది. మరియు మెప్మా సిబ్బంది ఆర్పీ లతో సమన్వయం చేసుకొని వీధి విక్రయదారుల నమోదు కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని సెక్రెటరీ లను, మెప్మా సిబ్బంది ఆర్పీ లను కోరడమైనది. ఈ శిక్షణ మరియు సమీక్షా సమావేశం టిపిఆర్ఓ ఎం.జగన్మోహనరావు,టిపిఎస్ ఫిలిప్ , మెప్మా సిబ్బంది ఆర్పీలు,వార్డు వెల్ఫేర్ సెక్రెటరీలు,ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

## రెండు డ్రోన్లు మంజూరు

**రామభద్రపురం, మే 13 మేజర్‌న్యూస్:** మండలానికి రెండు వ్యవసాయ డ్రోన్లు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి వెంకటయ్య తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో వ ఎంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఆరికతోట, తారాపురం గ్రామాలకు ఈ డ్రోన్లు మంజూరయ్యాయని, రూ.10లక్షల విలువచేసే ఒక్కొక్కడ్రోన్కు ప్రభుత్వం రూ.8లక్షల సబ్సిడీ అందిస్తోందని, దీనివలన ఎరువులు, పురుగు మందుల పిచికారికి ఎంతగానో ఉపయోగపడతాయని, తక్కువ ఖర్చుతో వేగంగా పనులు చేయవచ్చునన్నారు. ప్రస్తుతం నవధాన్యాల సాగుపై రైతులు దృష్టిసారించాలని, దీనివల్ల భూములు సారవంతం అవుతాయని అన్నారు. నేలలు కార్బన్ శాతం పెరగడానికి ఈ నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ ఎరువులపై దృష్టిసారించాలని తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్లో ముందే పశుగ్రాసాలు వినియోగించాలని అన్నారు.

## వాడాడలో వైభవంగా పైడితల్లమ్మ గ్రామ దేవత పండుగ



**బాడంగి, మే 13, మేజర్‌న్యూస్:** మండలంలోని వాడాడ గ్రామంలో మంగళవారం ఆ గ్రామ ఇలవేల్పు కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి పైడితల్లమ్మ గ్రామ దేవత పండుగ ను వైభవంగా నిర్వహించారు ఎమ్మెల్యే బేబీ నాయన, బొబ్బిలి బుడా చైర్మన్ తెంటు లక్ష్మి నాయుడు లు పైడితల్లమ్మ గ్రామదేవతను దర్శించి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో ఉండేటట్లు చూడాలి అని రైతులు పండించే పంటలు అన్ని 100% పండేటట్లు చూడాలని వారు అమ్మవారిని కోరినట్లుగా వారు తెలిపారు సిరిమాను ను దర్శించుకుని ఇరువురు నాయకులు మొక్కులు చెల్లించారు ఈ సందర్భంగా గ్రామంలో పలు సాంఘిక సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు 15 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్నటువంటి గ్రామ దేవత పండగకు అధిక సంఖ్యలో భక్తులు బంధువులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు

## ఎంఎస్పీలు గ్రామాల్లో నిఘా నేత్రాలుగా ఉండాలి



**రామభద్రపురం, మే 13, మేజర్‌న్యూస్:** గ్రామాల్లో ఎంఎస్పీలు నిఘా నేత్రాలుగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు సహకారం అందివ్వాలని ఎస్ఐ వెలమల ప్రసాద్ కోరారు. స్థానిక పోలీసు స్టేషన్లో మంగళవారం ఎంఎస్పీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామాల్లో బాల్య వివాహాలు నిరోధించడానికి చర్యలు తీస కోవాలన్నారు. అలాగే గ్రామాల్లో రాజకీయ కక్షలు, వివాదాలపై వెంటనే సమాచారం పోలీసు స్టేషన్కు అందించాలని, మహిళలపై దాడులు, మద్యం బెల్టుషాపులు, జూదం వంటివాటి పై కూడా దృష్టిసారించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## సిబిఎస్ఇ బోర్డు పరీక్షలలో గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



SRISTI RAJ
D.O.P : 08-10-2023



CHINTA LASYA SRI
D.O.P : 08-10-2023

**రామభద్రపురం, మే 13, మేజర్ న్యూస్:** అత్యంత ప్రతిష్టాత్మకమైన సిబిఎస్ఇ బోర్డు పరీక్షలలో చరిత్రలో 100శాతంపాస్ పర్సంటేజ్ తో, 28 మంది విద్యార్థులలో 24 మంది డిస్టింక్షన్70 శాతంలో గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు ప్రతిభ సాధించడం గర్వకారణమని యాజమాన్యం మంగళ వారం తెలిపారు. మిగిలిన 4గురు విద్యార్థులు కూడా ఫస్ట్ క్లాస్ సాధించ డం జిగిందని ఇంతటి ఘన విజయాన్ని అందించిన విద్యార్థిని విద్యార్థులకు,వారి తల్లిదండ్రులుకు, మరియు మా ఉపాధ్యాయ బృందానికి గ్లోబల్ వ్యూ స్కూల్ యాజమాన్యం తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియ జేస్తున్నామన్నారు. వరుసగా రెండో విద్యా సంవత్సరంలో కూడా 95 శాతం సాధించి జోనల్ స్థాయిలో సెకండ్ ప్లాస్ సాధించడం ఆనందంగా ఉందిన్నారు.

## కూటమీ ప్రభుత్వ గెలుపుకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు

### - ఎమ్మెల్యే కోళ్ల



**లక్కవరపుకోట, మే 13, మేజర్‌న్యూస్:** 2024 మే 13 న జరిగిన సార్వత్రిక ఎన్నికలు ముగిసి నేటికీ ఏడాది పూర్తి కావస్తున్నా కారణంగా గత ఏడాది ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని అలాగే ఎమ్మెల్యే గా కోళ్ల లలిత కుమారిని నమ్మి ఓటు వేసి గెలిపించి అధికారాన్ని ఇచ్చిన ప్రతి ఒక్కరికి కోళ్ల లలిత కుమారి కృతజ్ఞతలు తెలిపారు మంగళ వారం ఆమె స్వగృహం లో ఆమె ముస్టాడుతూ నాపై నమ్మకం ఉంచి ఓటు వేసి, నాకు అఖండ విజయాన్ని అందించి, ప్రజా సేవకు ఒక గొప్ప అవకాశం ఇచ్చారు. మీ విలక్షణమైన తీర్పుతో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని ఇచ్చారు. ఎస్.కోట నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని మెజారిటీని అందించినందుకు మరియు ఈ విజయాన్ని సాధించడానికి మీరు చూపిన ఆదరణకు, మమ్మల్ని నమ్మి ఇచ్చిన ఆమోదానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గడిచిన సంవత్సరంలో మీ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నేను నిత్యం కృషి చేస్తున్నాను... మీరు చూపిన ప్రేమ, ఆదరణ, విశ్వాసం నాకు శక్తిని ఇచ్చాయి. ప్రజల కోసమే పని చేయాలి అన్న అభిమానం నాకు ప్రతి రోజూ ప్రేరణగా మారింది. ఈరోజు, మన ప్రజాస్వామిక విజయానికి గుర్తుగా, నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు చూపిన ఆశీర్వాదం ఎల్లప్పుడూ నా మీద ఉండాలని కోరుకుంటున్నాను.అని మీ ఆశీర్వాదంతో, సదా మీ సేవలో,వుంటాను అని తెలిపారు.

## అత్యవసర పరిస్థితులో ప్రాథమిక చికిత్స సకాలంలో అందించాలి

### : డాక్టర్ జగన్మోహన్



**సీతానగరం/పార్వతీపురం, మే 13, మేజర్‌న్యూస్:** అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స సకాలంలో అందించడం ద్వారా ప్రాణాపాయస్థితి నుండి తప్పించవచ్చని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పేర్కొన్నారు. పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు.ఆరోగ్య తనిఖీలు,వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో వినియోగించే పరికరాలు,కిట్లు పరిశీలించారు.అత్యవసర సమయంలో ప్రాథమిక వైద్యానికి అందుబాటులో ఉన్న పరికరాలు,నిర్వహణ తీరు పరిశీలించారు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్, సిలిండర్,ఆక్సిజన్ ఫ్లో మీటర్,అంబు బ్యాగ్, ఈసిజీ యంత్రం,బిపి పరికరం, సిబిసి,యూరిన్ అలైజర్స్, వీల్ చైర్,స్ట్రెచర్,అగ్నిమాపక యంత్రం,బ్యాటరీ బ్యాక్ అప్, కోల్డ్ చైన్ సిస్టమ్, అత్యవసర ఇంజెక్షన్లు మొదలగు వాటిని పరిశీలించేరు.వీటి పని తీరును ఎప్పటికపుడు గమనించాలని,ఏదైనా సాంకేతిక,యాంత్రిక సమస్య వస్తే వెంటనే పరిష్కరించాలని సూచిం చారు.విపత్తులు, ప్రమాదాలు, ూఎపిడెమిక్ మొదలగు అత్యవసర సమ యంలో ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక చికిత్స సిద్ధంగా ఉండాలన్నారు. వైద్యాధికారులు జి.ధరణి, జి.గోపాలకృష్ణ, ఎపిడెమిక్ సత్తిబాబు, ూవెంకటనాయుడు,జయలక్ష్మీ,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారవారధి జనవాణి

### - ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, మే 13, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఏవీఎన్ కళాశాల అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు. వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని సంభందిత అధికారులను ఆదేశించారు. ప్రదానంగా వార్డులోని సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్లు, విద్యుత్ లైట్లు, నూతన రేషన్ కార్డులు, ప్రమాద కరంగా ఉన్న భవనాలు తొలగింపు, పలు వార్డులకు త్రాగునీరు సప్లయ్ అయ్యే వాటర్ ట్యాంక్‌కు ప్రహారీ గోడ ఏర్పాటు వంటి తదితర అంశాలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిశితంగా వింటూ వాటిని నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజవర్గాన్ని ఉన్నతంగా అభివృద్ధి చేసిన తర్వాతే ఆయా ప్రాంతాలకు వస్తానని తెలియజేశారు. ప్రజలు సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే జనవాని కార్యక్రమాన్ని చేపట్టానన్నారు. ఆయా దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలను అనుసరిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు పాత్ర నిర్వహిస్తానని తెలియజేశారు. ప్రజలు సమస్యలను తనకు నేరుగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉన్నతాధికారులు ఆయా వార్డ్ ల కార్పొరేటర్ లు, టీడీపీ, జనసేన, బిజెపి, శ్రేణులు, సిబ్బంది, కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు, ఆయా వార్డులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**జనవాణిలో ఇబ్బందిపడ్డ ప్రజలు..**

విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజలు వేసవి కారణంగా కొంత ఇబ్బందిపడ్డారు. జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యేకు నేరుగా వినతులు ఇచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని నాలుగు వార్డుల ప్రజలు ఏవీఎన్ కళాశాల వద్దకు మంగళవారం ఉదయం 9 గంటల కంటే ముందుగానే చేరుకున్నారు. కార్యక్రమం 9 గంటలకు ప్రారంభమైంది. వచ్చిన ప్రజలకు టెంట్ వేసి కుర్చీలో నాలుగు వార్డుల నాయకులు కూర్చోపెట్టారు. అయితే వారందరినీ కార్యక్రమం పూర్తయినంత వరకు ఉండమని చెప్పడంతో వారంతా మధ్యహ్నం 12 గంటల వరకు కూర్చోని వినతులు ఎమ్మెల్యేకి అందించి మరళ వారి స్థానాల్లో వారు కూర్చున్నారు. అయితే ప్రజలు కూర్చున్న ప్రదేశం చుట్టూ కనీసం రెండు ప్యాన్‌లు కూడా ఏర్పాటు చేయలేదు. అలాగే వేసిన టెంట్‌కు చుట్టూ ఎమ్మెల్యే కు స్వాగతం పలుకుతూ 30, 36, 37, 38 వార్డుల నాయకులు బేనర్లు ఏర్పాటు చేశారు. దీంతో చుట్టు ప్రక్కల మూసుకుపోయి గాలి రావడం తగ్గిపోయింది. దీంతో అర్జిదారులు ఇబ్బంది పడ్డారు. ఎండవేడి ఎక్కువగా ఉండటం గాలిలో తేమ శాతం పెరిగిపోవడం ఒకటే ఉక్కపోతతో జనవాణికి వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీనిని గమనించిన బారతీయ జనతా పార్టీ నాయకుడు రామ్ సభలో నేరుగా మైకు తీసకుని ఏర్పాట్లుపై విమర్శించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వంశీ ఇకపై జనవాణి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చూడాలని తన అనుచరులకు ఆదేశించారు.

## 23వ వార్డులో జీవీఎంసీ ఇన్ చార్జ్ కమిషనర్ ఆకస్మిక పర్యటన



**విశాఖపట్నం, మే 13, మేజర్‌న్యూస్:** విశాఖ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మరియు జివిఎంసి ఇంచార్జ్ కమిషనర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ 3వ జోన్ 23వ వార్డు పరిధిలోని కె.ఆర్.ఎం కాలనీ తదితర ప్రాంతాలలో అకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ నగరంలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు పరిశుభ్ర పరిచేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు. కె.ఆర్.ఎం కాలనీలో గల యార్డును పరిశీలించి వ్యర్థాలు ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్ కి తరలించాలని ఆదేశించారు. కె.ఆర్.ఎం కాలనీలో తదితర ప్రాంతాలలో డోర్ టు డోర్ వ్యర్థాల సేకరణ, తరలింపు ప్రక్రియను పరిశీలించి నిత్యం పారిశు ధ్య నిర్వహణ పనులపై ప్రత్యేక శ్రద్ధను చేపట్టాలని, కాలువలను, గెడ్డలను పరిశీలించి రానున్న వర్షాకాలం దృష్ట్యా అన్ని వార్డులలో గల గెడ్డలలో పూడికలు, వ్యర్థాలు తొలగించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్ కు కమీషనరు ఆదేశించారు. ఈ పర్యటనలో 3వ జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఎ.ఎమ్.ఒ.హెచ్ బి.ప్రసాదరావు, శానిటరీ సూపర్వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్స్పెక్టరు సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



**విశాఖపట్నం, మే 13, మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నగరంలోని ఎండాడలో గల సెయింట్ లూక్స్ నర్సింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. నర్సులకు ఆరాధ్య దైవమైన ఫ్లోరెన్సన్ నైటింగేల్ 205వ జన్మదినాన్ని పురస్కరించుకొని జరిగిన ఈ కార్యక్రమంలో విజయా లూక్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సెయింట్ లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపక బృందం ఎండాడలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో జరిగిన సమావేశంలో డాక్టర్లు, ప్రొఫెసర్లు, పాల్గొని నర్సింగ్ సేవలను కొనియాడారు.రంగానికి వెన్నెముక లాంటిదని విజయా లూక్ సంస్థ కరస్పాండెంట్ డాక్టర్ మమతా ప్రసాద్ ప్రశంసించారు విశాఖపట్నంలో మొట్టమొదటి ప్రైవేట్ నర్సింగ్ కళాశాల సెంట్ లూక్స్ కళాశాలయని దీన్ని ప్రారంభించిన దివంగత రెవరెండ్ డాక్టర్ ఎం.పీటర్సన్ లూక్ అని ఈ సందర్భంగా తెలియజేశారు.కార్యక్రమంలో సెయింట్ లూక్స్ కళాశాల కరస్పాండెంట్ ప్రీతంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమల్లి ప్రొఫెసర్ ఓషన్ లీ, డాక్టర్ సుహాసిని, అశ్వని కుమారి, తదితరులు పాల్గొన్నారు. అత్యుత్తమ సేవలందించిన పలువురు నర్సులను ఈ సందర్భంగా సత్కరించారు. కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ముగించారు.

## 17,18 తేదీల్లో గైనకాలజీ సదస్సు

**విశాఖపట్నం, మే 13, మేజర్‌న్యూస్:** భారతదేశ గైనకాలజీ వైద్యశాస్త్రంలో అగ్రగామిగా కొనసాగుతున్న ఫెడరేషన్ అఫ్ అబ్స్ట్రిక్ మరియు గైనకాలజికల్ సొసైటీస్ అఫ్ ఇండియా వేవ్స్-2025 పేరిట సదస్సు నిర్వహిస్తోంది. ఈ సమావేశం మే 17 నుండి 18 వరకు బీచ్ రోడ్డు లోని హెూటల్ రాడిసన్ బ్లూలో జరగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ గైనకాలజిస్టులు, మహిళా ఆరోగ్య నిపుణులు, వైద్య విద్యార్థులు మరియు పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో ఆధునిక లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, గర్భధారణ పద్ధతులు, ప్రసూతి సమయంలో అత్యవసర చికిత్సలు, హార్మోనల్ చికిత్సల్లో ఉన్న సవాళ్లు, మరియు మహిళల పునరుత్తరణ ఆరోగ్యం వంటి అనేక కీలక అంశాలపై వివిధ సెషన్లు నిర్వహించబడతాయి. ఈ కాన్ఫరెన్స్‌కి డా.కె సుబ్బరాజు డా. టీ. రాధ ,ఆర్గనైజింగ్ ఛైర్‌పర్సన్‌లు గా వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు ఓజీ విశాఖపట్నం సొసైటీ అధ్యక్షులు డాక్టర్ పద్మావతి నాయుడు పాల్గొంటారు. ఈ కార్యక్రమం వైద్య నిపుణులకు విజ్ఞాన మార్పిడి వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమం లో భాగంగా ఈ నెల 17 సాయంత్రం 5.30కి జరిగే ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరవుతారు.

## శ్రీశ్రీశ్రీ భూలోక మాత అమ్మవారు పండుగ మహెూత్సవం



**అక్కయ్యపాలెం, మే 13, మేజర్‌న్యూస్:** విశాఖ ఉత్తర నియోజకవర్గం 24వార్డు రేసపువానిపాలెంలో జరిగిన శ్రీశ్రీశ్రీ భూలోక మాత అమ్మవారు పండుగ మహెూత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కె.కె రాజు గారు..ఈ మహెూత్సవంలో 24వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి,కర్రీ మురళీ కృష్ణరెడ్డి,గుడ్ల అశోక్ రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సిబి ఎస్ ఈ ఫలితాలలో రవీంద్ర భారతి విజయ ధమాకా

**ఆనందపురం, మే 13, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలం వెల్లంకి రవీంద్ర భారతి పాఠశాలలో సీబీఎస్ఈ ఫలితాలలో విద్యార్థులు విజయ ధమాకా మోగించి నట్లు పాఠశాల ఛైర్మన్ ఎస్.ఎస్ మణి తెలిపారు. 500 మార్కులకు 487 మార్కులు సాధించిన మేఘ వర్షిని ప్రథమ స్థానంలో నిలిచిందని, 470 మార్కులకు పైగా ఆరుగురు విద్యార్థులు , 450 కి పైగా 12 మంది విద్యార్థులు సాధించారని 98% తో పరీక్షా ఫలితాలలో అగ్రస్థానంలో నిలిచారన్నారు. కె. ఉజ్వల సాయి 480 ,వి షణ్ముఖ 475 ఎస్ భాశ్య శ్రీదేవి 470,తేజస్విని 4 76 ,పి శ్రీ హర్షిత 473 కౌశల్ సింగరాజ్ 470 మార్కులు సాధించారు. విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారానే ఈ యొక్క ఉత్తీర్ణత, విజయాన్ని సాధించగలిగామన్నారు. విద్యార్థుల అభినందన సభలో నార్తాంధ్ర ఇన్చార్జి ఎన్ వెంకటేష్, సీజియం జి ఆర్ వసంత, పాఠశాల డీన్ ఉమా మహేష్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.



మేఘ వర్షిని

## మానవ హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయ శంకర్

**ఆనందపురం, మే 13, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలం లోడగలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన మామిడి ఉదయ్ శంకర్ ను మానవ హక్కుల జాతీయ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ ఆంధ్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్లిక్ రిలేషన్ విభాగానికి ఇదివరకే నియమించడం జరిగింది. పదవి కాలం పూర్తయిన సందర్భంగా మరల 2026 వరకు పొడిగిస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఏప్రిల్ 2026 సంవత్సరం వరకు. ఈ పదవులు మామిడి ఉదయ్ శంకర్ కొనసాగుతారు. ఈ సందర్భంగా ఉదయ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్లో స్థానం కల్పించినందుకు, జాతీయ ఛైర్మన్ షేక్ సిరాజుద్దీన్ కు అలాగే మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.



## ఎస్.ఎం.డి విభాగాధిపతికి ఆత్మీయ సత్కారం



**ఉక్కు నగరం, మే 13, మేజర్‌న్యూస్:** స్టీల్ ప్లాంట్ ఎస్.ఎం.డి విభాగాధిపతి ,జనరల్ మేనేజర్ దాసరి శ్రీనివాస్‌ను ఎం.ఎం.ఎస్.ఎం విభాగానికి చెందిన అధికారులు ఇల్లూరి ఉమా మహేశ్వర రావు, మంతెన అప్పారావు, రామ్ గోపాల్, నష్కర్ ,జి.నారాయణ ,పి.శ్రీనివాస్ ,హరి ప్రసాద్ , కృష్ణ వేణి మంగళ వారం ఎస్.ఎం.డి విభాగం హెచ్ ఓ డి దాసరి శ్రీనివాస్ ను పూల దండ ,శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాసరి శ్రీనివాస్ ఎం.ఎంఎస్.ఎం విభాగం, ఎస్.టి.ఎం విభాగంలో అధికారిగా విధులు నిర్వహించి ఎస్.ఎం డి హెచ్ డి గా బాధ్యతలు చేపట్టారని ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## ఆపరేషన్ థండర్- ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో మాక్ డ్రిల్

### - అత్యవసర పరిస్థితుల్లో సమిష్టి స్పందన సామర్థ్యం అభివృద్ధి



**పరవాడ, మే 13, మేజర్‌న్యూస్:** ఆపరేషన్ థండర్ – ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో సమిష్టి స్పందన సామర్థ్యం అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి అనుకోని సంఘటనలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కమాండో విభాగమైన ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఆపరేషన్ థండర్ పేరుతో సమగ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. డ్రిల్ ప్రణాళిక ప్రకారం, ఆరు మంది ఉగ్రవాదులు ఆయుధాలతో ఎన్టీపీసీ కేంద్రంలో చొరబడి, బహిరంగంగా ఉన్న కొందరిపై కాల్పులు జరిపి, అనంతరం లోపలికి ప్రవేశించినట్లుగా సమాచారంతో ఆక్టోపస్ బృందం హుటాహుటిన స్పందించింది. వ్యూహాత్మకంగా ఆపరేషన్‌ను ప్రారంభించి, ఉగ్రవాదులను న్యూట్రలైజ్ చేసి, వారి చేతిలో బందీగా ఉన్న హెూస్టేజెస్‌ను సురక్షితంగా రక్షించారు. ఈ డ్రిల్ అనకాపల్లి జిల్లా పోలీసు సూపరిండెంట్ తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో నిర్వహించేందుకు ముందుగానే డ్రిల్ సజావుగా కొనసాగేందుకు, సమన్వయాన్ని మెరుగుపర్చే ఉద్దేశంతో ప్రత్యేక కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్ టి పి సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ , సి ఏ ఎస్ ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్ కుమార్ , ఆక్టోపస్ అదనపు పోలీస్ అధికారి రాజా రెడ్డి , డీఎస్పీ వల్లం విష్ణు స్వరూప్ , ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు, ఇతర ఎన్టిపిసి సిఐఎస్ఎఫ్ అధికారులు, మెడికల్, ఫైర్, రెవెన్యూ, సేఫ్టీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ మాక్ డ్రిల్‌లో అనకాపల్లి జిల్లా ఏఆర్ విభాగానికి చెందిన బీడీ (బాంబు డిస్పోజబుల్) టీం, డాగ్ స్క్వాడ్, మరియు ఇతర పోలీసు బలగాలు సైతం పాల్గొని ప్రావీణ్యం ప్రదర్శించారు.

## విపత్కర పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉందాం... దీటుగా ఎదుర్కొందాం...

### - భాగస్వామ్యమైన పోలీసు, రెవెన్యూ, జీవీఎంసీ, ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలు



**విశాఖపట్నం, మే 13, మేజర్‌న్యూస్:** ఉగ్రదాడులపై అప్రమత్తం చేస్తూ పెదజాలరిపేట టిడ్కో గృహ సముదాయం వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించిన సివిల్ మాక్ డ్రిల్, భాగస్వామ్యమైన వివిధ విభాగాల అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆరెఫ్ సిబ్బంది.



